
## సోమశిలలో 60.045 టీఎంసీల నీరు



అనంతసాగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం 1,035 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 60.045 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2850, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.


### ఇళ్ల క్రమబద్ధీకరణకు

## దరఖాస్తు చేసుకోండి!

● డిసెంబరు 31 వరకు గడువు : జేసీ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. నిరభ్యంతకర భూముల్లో 2019, అక్టోబరు 10వతేదీ కంటే ముందు భూమిని ఆక్రమించుకుని ఆర్‌సీసీ స్లాబ్ లేదా రేకులతో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉండేవారు రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ఈ ఏడాది డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గుడిసెలు, తాటాకు పూరిళ్లకు ఇది వర్తిసుందన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామని పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామని వివరించారు.

● 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుందన్నారు. 450 గజాలకు మించి ఆక్రమణలలో ఉన్నవారు బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.





నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో మూలస్థానేశ్వరస్వామి ఆలయం

## ఓం నమఃశివాయ!

● నేడు శివరాత్రి పర్వదినం ● ముస్తాబైన శైవక్షేత్రాలు

ఆది మధ్యాంత రహితుడు, సృష్టి స్థితి లయకారకుడు పరమేశ్వరుడు. భక్తితో కొలిచినం తనే కోరిన వరములిచ్చే భక్తసులభుడు ఆ సర్వేశ్వరుడు. అభిషేకప్రియుడైన మహాదేవుడు లింగరూపంలో ఉద్భవించిన పర్వదినమే మహాశివరాత్రి. ఈ పండుగ కోసం జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే అన్ని ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలకు ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి నుంచి లింగోద్భవ అభిషేకాలు జరగనున్నాయి. శివరాత్రి రోజున హరనామస్మరణ, బిల్వార్చన, రుద్రాభిషేకంతో పాటు భక్తులు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. సముద్ర, నదీ స్నానాలు చేస్తారు. రాత్రి జాగారం చేస్తూ పురాణ పఠనం, శివనామ జపం చేస్తారు. కాగా, జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాల్లో ఇప్పటికే శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

● పటిష్ట భద్రత

నెల్లూరు (క్రైం) : మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ జి కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు, రథోత్సవాలు, ఘాట్లు, తీర ప్రాంతాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశామని, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో ఆలయాలను సందర్శించుకోవాలని, నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు.

● మూలస్థానేశ్వరుడికి రావణసేవ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు వెండి రావణుడిపై కొలువుదీరి దర్శనమిచ్చారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, విశేష అలంకారం, అర్చనలు జరిగాయి. చప్పర ఉత్సవం, సాయంత్రం పూలంగిసేవ, ఆ తర్వాత ఆదిదంపతులకు కుంభహారతులు కనుల పండువగా జరిగాయి. భక్తుల శివనామస్మరణలతో మారుమోగాయి.



నెల్లూరు : రావణాసురుడిపై కొలువుదీరిన ఆదిదంపతులు

### ప్రైవేటు కళాశాలల గుర్తింపునకు

## దరఖాస్తుల ఆహ్వానం

● ఈ నెలాఖరులోగా సమర్పించాలి : ఆర్ఐవో

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి అఫిలియేషన్, రెన్యువల్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు అదనపు సెక్షన్లు, కోర్సులతో పాటు ద్వితీయభాష లేదా మీడియాన్ని, ప్రదేశాన్ని, మేనేజ్‌మెంట్‌ను కూడా మార్చుకోవచ్చన్నారు. అలాగే కళాశాల మూసివేయడానికి, పునఃప్రారంభించడానికి, ఎఫ్‌డీఆ ర్‌ను విడుదల చేసుకునేందుకు కూడా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఆయా కళాశాలల యాజ మాన్యాలు సంబంధిత పత్రాలను ఆన్‌లైన్ అఫిలియేషన్ మేనేజ్‌మెంట్(ఓఏఎంఎస్) ద్వారా ఈనెల 28, లోగా దరఖా స్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత ఫీజు చెల్లించి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల న్నారు. ఇంటర్‌బోర్డులోకానీ, ఆర్ఐవో కార్యాలయంలోకానీ నేరుగా స్వీకరించరని, ఒకసారి బోర్డుకు చెల్లించిన ఫీజును తిరిగి ఇవ్వడం, సర్దుబాటు చేయడం వీలు కాదన్నారు. గతం లో గుర్తింపు రెన్యువల్ చేసుకోని కళాశాలలు కూడా ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కండిషనల్ గుర్తింపు పొందిన కళాశాలలు మూడు నెలల్లో లోటుపాట్లను సరిచేసుకుని సంబంధిత ధ్రువపత్రాలను అందచేయాలన్నారు. లేని పక్షంలో నిర్ణీత గడువు తరువాత రూ.50వేల పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసిన కళాశాలలను తనిఖీ కమిటీ సందర్శించి, అందించే నివేదిక ఆధారంగా అనుమతులు మంజూరు చేస్తామని పేర్కొన్నా రు. బోర్డు నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా కళాశాలలు అదనపు సెక్షన్‌లు నిర్వహించినా, ప్రవేశాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మరిన్ని వివరా లకు స్టోన్ హౌస్‌పేట కేవీసీ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.



### పొగాకు వేలం కేంద్రాలు

## మార్చి 10, 19 తేదీల్లో ప్రారంభం

కందుకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాలను మార్చి 10, 19 తేదీలలో ప్రారంభించనున్నారు. మంగళవారం గుంటూరులోని పొగాకుబోర్డు కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కందుకూరు 1, కొండపి, పొదిలి, ఒంగోలు 1 వేలం కేంద్రాలు మార్చి 10న ప్రారంభించనున్నారు. కందుకూరు 2, డీసీ పల్లి, కలిగిరి, కనిగిరి, టంగుటూరు, ఒంగోలు 2, వెల్లంపల్లి వేలం కేంద్రాలు మార్చి 19న ప్రారంభం కానున్నాయి. గుంటూరులోని కేంద్రకార్యాలయంలో పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు సాగువ్యయం గణనీయంగా పెరిగినందున గత సంవత్సరం కన్నా కనీసం 20 శాతం అదనంగా సరాసరి ధర దక్కేలా వేలం ప్రక్రియను నడిపించాలని, వాతావరణ ఆధారిత వ్యవసాయ బీమా ప్రధానమంత్రి ఫసల్ యోజనలో పొగాకు పంటకు కూడా స్థానం కల్పించేలా బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు.

## జిల్లాలో 500 సీసీ కెమెరాలతో నిఘా

● ఎస్పీ కృష్ణకాంత్

ముత్తుకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో భాగంగా జిల్లాలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల నిఘా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముత్తుకూరులో 32 లొకేషన్లలో 55 కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అనంతరం కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టీవీల్లో సీసీ కెమెరాలు నిఘా దృశ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాస రావు, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐలు విశ్వనాథ్‌రెడ్డి, జేపీ శ్రీనివాసరెడ్డి, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బరితెగింపు!

● ఇరిగేషన్ స్థలంపై వైసీపీ నేతల కన్ను

● 50 అంకణాల భూమి.. విలువ రూ.10కోట్లు

● పార్టీ కార్యాలయాన్ని నిర్మించే ప్రయత్నం

● పనులను అడ్డుకున్న అధికారులు

● సర్వేలో కాలువ పోరంబోకుగా నిర్ధారణ

నెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : 'మాకు అడ్డేంటి అనుకున్నారో లేదా మమ్మల్ని అడిగే దమ్ము ఎవరికి ఉందని భావించారో తెలియదు గానీ నెల్లూరు నగర నడిబొడ్డున వైసీపీ నాయకులు ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. హరనాథపురం కూడలి ప్రాంతంలో దాదాపు రూ.10 కోట్లు విలువ చేసే సుమారు 50 అంకణాల స్థలంలో వైసీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయం నిర్మాణానికి పూనుకున్నారు. వారం రోజుల క్రితం వైసీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ కుమార్‌రెడ్డి ఈ స్థలంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి వేగంగా ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. ఈ విషయంపై మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించిన అధికారులు.. ఆ స్థలం కాలువ పోరంబోకుగా ప్రాథమికంగా నిర్ధారించుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సర్వే చేసి వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్న స్థలం ఇరిగేషన్‌కు చెందినదిగా తేల్చారు. అసలు భవనం నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. ఆ వెంటనే ఇరిగేషన్ అధికారులు సదరు స్థలంలో 'ఈ స్థలం ఇరిగేషన్‌కు చెందినది'గా బోర్డు పెట్టారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నెల్లూరు ఇన్చార్జి ఆర్డీవో వంశీకృష్ణ వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడే రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే నిర్వహించారు. ఆ స్థలం గుండ్లపాలెం కాలువ, సర్వేపల్లి కాలువల మధ్యలో ఉన్న కాలువ పోరంబోకుగా నిర్ధారించారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం అధికారుల వాదనను ఖండించారు. ఇది ఇరిగేషన్ స్థలం అయినా తమకు వందేళ్ల లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఆ లీజు డాక్యుమెంట్లను చూపించాలని అడిగితే బుధవారం చూపిస్తామని చెబుతున్నారు.



ఇరిగేషన్ స్థలంలో బోర్డు నాటి పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

● గతంలోనే వివాదం?

నెల్లూరులోని హరనాథపురం వద్ద సర్వేపల్లి కాలువ నుంచి గుండ్లపాలెం కాలువ చీలుతుంది. ఈ రెండు కాలువల మధ్యలో సర్వే నెం.893లో కాలువ పోరంబోకు స్థలం ఉంది. ఇక్కడ చాలా కాలం నుంచి కొంత మంది పేదలు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. వీటి పక్కనే గతంలో ఓ రైస్ మిల్లు ఉండేదని చెబుతున్నారు. ఆ స్థలంలోనే ఇప్పుడు వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ వివాదాస్పద స్థలంపై వైసీపీ ప్రభుత్వంలోనే ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. కొందరు దొంగ లీజు డాక్యుమెంట్లతో రూ.కోట్లు విలువైన స్థలాన్ని ఆక్రమించుకొని ఉన్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ కూడా జరిగింది. కలెక్టరేట్‌లో గానీ ఇటు ఇరిగేషన్ కార్యాలయంలో గానీ లీజుకు సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్లు లభ్యం కాలేదు. దీంతో అప్పట్లోనే ఇరిగేషన్ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని అధికారులు ప్రయత్నించినా నాడు వైసీపీ ముఖ్య నేతలు అడ్డుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తు చేస్తున్నారు. ఒకవేళ లీజు డాక్యుమెంట్లు ఉంటే ఎందుకు బయటపెట్టడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సాధారణంగా ఇరిగేషన్ స్థలాలను లీజుకు ఇవ్వరని, ఒకవేళ ఇచ్చినా ఒక పర్పస్ కోసం మాత్రమే ఇస్తారని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ పర్పస్ ముగియగానే తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం తమకు ఉంటుందని అంటున్నారు. అయితే హరనాథపురం వంటి ప్రధాన కూడలిలో కాలువ పోరంబోకు స్థలంలో ఏ ధైర్యంతో వైసీపీ నేతలు కార్యాలయాన్ని నిర్మిస్తున్నారన్న చర్చలు జరుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా ఆ భూమి ఇరిగేషన్‌దేని స్పష్టం చేశారు. అవతలి వ్యక్తులు లీజు డాక్యుమెంట్లు ఉన్నట్లు చెబుతున్నారని, వాటిని ఇవ్వాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ డాక్యుమెంట్లు పరిశీలించాక నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## కాంప్లెక్స్‌లకు కాసులు

● ఒక్కోదానికి రూ.1 లక్ష చొప్పున విడుదల

● జిల్లాలో 136 క్లస్టర్-ఏ కాంప్లెక్స్‌లు

● క్లస్టర్-బి పరిధిలో 117.. త్వరలో వీటికీ నిధులు

● కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యా శాఖ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లను పునర్‌వ్యవస్థీకరణ చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయులపై అజమాయిషీ బాధ్యతను సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అప్పగించారు. జిల్లాలో గతంలో ఉన్న 253 స్కూల్ కాంప్లెక్స్‌లలో స్వల్ప మార్పులు చేపట్టి 136 క్లస్టర్-ఏ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశారు. వీటికి గత వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ25వేలు ప్రకటించినా ఏడాదిలో చివరిలో లేదా రెండేళ్లకు ఒకసారి విడుదల చేసేవారు. దీంతో హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిస్థితుల్లో పూర్తిగా మార్పు రావడంతోపాటు ఒక్కో కాంప్లెక్స్‌కు లక్ష రూపాయల చొప్పున విడుదల చేశారు.

### రూ.1.36 కోట్లు విడుదల

జిల్లాలో ఇప్పటివరకు 253 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా వీటిలో మార్పులు తీసుకువస్తూ ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 800 నుంచి 1000 మంది విద్యార్థులు, 40-50 మంది ఉపాధ్యాయులు ఉండేలా క్లస్టర్-ఏలుగా పేరుమార్చి జిల్లాలో 136 కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన 117 కాంప్లెక్స్‌లను క్లస్టర్-బీలుగా మార్పు చేశారు. వీటికి కూడా త్వరలో నిధులు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యా యుడికి పలు బాధ్యతలు అప్పగించి తన పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణను ఆయనే చూసుకునేలా ఉత్తర్వులిచ్చారు. అలాగే టీచర్ల పనితీరు, జీతాలు డ్రా చేయడం, సెలవులు మంజూరు చేయడం, ఇతర పాలనా పరమైన బాధ్యతలు కూడా హెచ్‌ఎంలు పర్యవేక్షిస్తారు. తాజాగా ఏర్పాటు చేసిన 136 క్లస్టర్-ఏ స్కూల్ కాంప్లెక్స్‌లకు ఒక్కో దానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.1.36 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను కాంప్లెక్స్ నిర్వహణ కోసం వినియోగించాలి. ప్రతినెలా 3వ శనివారం కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సమావేశం నిర్వహించాలి. విద్యార్థులకు నూతన పద్ధతుల్లో విద్యాబోధన, గడిచిన మాసంలో జరిగిన తరగతులపై చర్చించడం, లెర్నింగ్ ఉపాధ్యాయులు మెటీరియల్స్ తయారు చేయించాలి. అలాగే ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణలు ఇప్పించడం, ఇతర కాంప్లెక్స్ అవసరాలకు ఈ నిధులను ఉపయోగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## కడప సర్వజన ఆసుపత్రి ఆర్‌ఎంవోపై విచారణ

● నెల్లూరు డీఎంహెచ్‌వోగా చేసిన అక్రమాలు ● ప్రాథమిక విచారణలో నిర్ధారణ

కలికిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కడప మూడు వందల పడకల సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.పెంచలయ్యపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అభియోగాలకు సంబంధించిన నోటీసులను ప్రభుత్వం జారీ చేసింది. నెల్లూరు డీఎంహెచ్‌వోగా పనిచేసే సమయంలో జరిగిన అవకతవకలకు పెంచలయ్యను పూర్తి బాధ్యుడిగా ప్రభుత్వం నిర్ధారించింది. కృష్ణాపురం పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తుండిన వంశీకృష్ణ సుమన్ 2022 మే 5వ తేదీ నుంచి 2024 సెప్టెంబరు వరకూ డ్యూటీలో లేకున్నా ప్రతి నెలా జీతాలు చెల్లించారనేది ప్రధాన అభియోగం. ఏకీకృత జీతం (కన్సాలిడేటెడ్‌పే)తో జీతాలు చెల్లిస్తూనే విధుల్లో లేకున్నా 2024, మార్చిలో అతనికి రెగ్యులర్ పే స్కేలు మంజూరు చేశారనేది మరో అభియోగం. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జిల్లాలో పనిచేస్తున్న ఒక వైద్యాధికారితో సహా 14 మంది ఉద్యోగులను డెప్యుటేషన్‌పై నియమించారని మరో ఆరోపణ. డాక్టర్ వంశీకృష్ణ సుమన్ 28 నెలల గైర్హాజరు కాలంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య వైద్యాధికారులతో ఏడు సమావేశాలు నిర్వహించినా ఆయన విధుల్లో లేరన్న విషయాన్ని గుర్తించకుండా విఫలమయ్యారని ప్రభుత్వం పేర్కొంది. డ్యూటీలో లేని వైద్యాధికారికి రూ.24,62,714 జీతాల రూపేణా క్రమం తప్పకుండా చెల్లించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి కారకుడయ్యాడని పేర్కొన్నారు. దీని పైన డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్‌తో నిర్వహించిన విచారణలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. ఈ మూడు ప్రధాన అభియోగాలతో ఆయనకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా తన వివరణను సమర్పించుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజులా డి హోస్‌మణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



# హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● మొదటి మూడు స్థానాల్లో కడప ● 4, 5, 6 స్థానాలు బాపట్ల జిల్లాకు.. ● జనంతో కిక్కిరిసిన గండవరం

కొడవలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండవరంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ పరిశీలకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. వీటిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో గండవరం వీధులు కిక్కిరిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 9 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి రూ.లక్షను కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొరసాల గురవారెడ్డికి చెందిన ఎడ్లు కైవసం చేసుకోగా రెండు, మూడు స్థానాల్లో కడప జిల్లా మైదుకూరు చెందిన వెంకటేష్, కుర్ర వెంకటేష్, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బాపట్ల జిల్లాకు చెందిన సాయిగణేష్, మారుమూల సుబ్బారెడ్డి, బాపట్ల వీరస్వాముల ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతులు అందజేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయన చైర్మన్ ఆలం మాలకొండయ్య, కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గండవరంలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు

# సృజనాత్మకతకు పదును పెట్టాలి

● క్రాఫ్ట్, డ్రాయింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సంగం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతకు పదును పెట్టేందుకు పాఠశాల స్థాయిలోనే కృషి చేయాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం ఆయన పీఎంశ్రీ పథకంలో ఎంపికైన స్థానిక జీబీకేఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో లోకాస్ట్ - నో కాస్ట్‌తో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తక్కువ ఖర్చుతో వ్యర్థాలతో తయారు చేసిన పలు రకాల బొమ్మలు, ప్రయోగాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆటా, పాటా, డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చి వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం చేపట్టిందన్నారు. ఈపథకంలో జిల్లాలో 42 ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. పదవ తరగతిలో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు 100 రోజుల ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని, ఈ ప్రోగ్రామ్‌లో ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




క్రాఫ్ట్, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య



# శివ పూజకు వేళాయె!

● నేడు మహాశివరాత్రి ● శైవక్షేత్రాల్లో విస్తృత ఏర్పాట్లు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదిన వేడుకలకు జిల్లా ముస్తాబయ్యింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శివక్షేత్రాల్లో బుధవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భోళా శంకరుడైన శివుడి కృప పొందాలని ప్రతి ఒక్కరూ ముక్కంటిని ఆరాధిస్తారు. అలాగే ఆదిదంపతుల కల్యాణం కూడా జరగనుంది. శివరాత్రి రోజున బిల్వార్చన నదీస్నానం, సముద్రస్నానం, ఉపవాసం, జాగారణం, శివలీలా కథా పారాయణం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. శివపార్వతుల కల్యాణం జరిగిన రోజు, శివుడు శివతాండవం చేసింది. శివరాత్రి నాడే. జిల్లాలోని అన్ని శైవ ఆలయాల్లో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు జరిగాయి. అలాగే సముద్ర స్నానాలకు రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కాటేపల్లి, కోడూరు బీచ్‌ల వద్ద పోలీసుశాఖ తీర ప్రాంత గస్తీ బృందాలు బందోబస్తులు ఉన్నాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయం, సుందరేశ్వరస్వామి ఆలయం, నీలకంఠేశ్వరాలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్ పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం తదితర శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. గండవరం ఉదయకాళేశ్వర స్వామి, కాటేపల్లి శ్రీకామాక్షి సమేత చంద్రశేఖర స్వామి, మైపాడు, కోడూరు, కృష్ణపట్నం సిద్ధేశ్వర వేణుగోపాల స్వామి, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, భైరవకోన, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఇలా అన్ని శైవక్షేత్రాలలో శివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేశారు.



నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో శ్రీరాజరాజేశ్వరి ఆలయం

## సరిహద్దుల్లో ముస్తాబు



భైరవకోనలో ఒకే రాతిలో మలిచిన నవ శివాలయాలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో బుధవారం జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఘటిక సిద్ధేశ్వరం, భైరవకోన క్షేత్రాలను నిర్వాహకులు ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అలాగే ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు.

● ఘటికసిద్ధేశ్వరం

ఈ క్షేత్రం అత్యంత ప్రాచీనమైంది. దారి పొడవునా పారే సెలయేళ్ల, ఆహ్లాదకర వాతావరణంతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఘటిక సిద్ధేశ్వరంలో శివునికి అత్యంత ఇష్టమైన బిల్వపత్రాలు ఉన్నాయి. ఈ పత్రాలతో భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఘటికసిద్ధేశ్వరంలో ప్రతిరోజు రాత్రి సమయాల్లో శివుని విగ్రహం చుట్టూ ఓ సర్పం ప్రదక్షణలు చేస్తుంటుందని చరిత్ర చెబుతుంది. క్షేత్రంలో ఏడాది పొడవునా నందినోట జలధార వస్తుండడం మరో విశేషం.

● కోటిలింగాలకోన భైరవకోన

మూడు పర్వతాలకు మధ్యనున్న ఈప్రాంతంలో ఎంతో ప్రశాంతంగా ప్రకృతి అందాలతో రమణీయంగా ఉంటుంది. బ్రహ్మ, రుద్ర, విష్ణు పర్వతాలని ఆ మూడు కొండలను పిలుస్తారు. వాటి నడుమనున్న భైరవకోనకు క్షేత్రపాలకుడిగా బాలభైరవుడని చెబుతారు. భైరవుడు బాలుడు కావడంతో దుర్గాదేవి అక్కడికి వచ్చిందని, భార్గవ ముని తపస్సు మూలంగా శివుడు భర్గేశ్వరుడిగా వెలిశాడని చెబుతారు. భైరవ, దుర్గ, భర్గులకు 128 ఆలయాలు నిర్మించారని, కోటి లింగాలను అక్కడ ప్రతిష్ఠించారని చారిత్రక కథనం. అప్పట్లో వెలిసిన 128 ఆలయాలు కాలగర్భంలో కలిసినా ఏకశిలలో తొలిచిన గుహలో ఉన్న నవ లింగాలయాలు నేడు దర్శన మిస్తాయి. కొండలపైనుంచి జాలువారే జలపాతంలో స్నానమాచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.



ఘటికసిద్ధేశ్వరంలో ఏకశిల ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## కోరిన కోరికలు తీర్చే కరుణామయులుగా..



జొన్నవాడ ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): అశేష భక్తుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కరుణామయులు మల్లికార్జునస్వామి, కామాక్షితాయి దంపతులు. 2వ శతాబ్దానికి పూర్వమే పవిత్ర పెన్నానదికి ఉత్తర ఒడ్డున జొన్నవాడ (రజితగిరి) పుణ్యక్షేత్రంలో కశ్యప్రజాపతి యజ్ఞంతో స్వామివారు స్వయంభువుగా, ఆదిశంకరాచార్యులచే అమ్మవారు పునఃప్రతిష్ఠతో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారుగా జొన్నవాడ క్షేత్రం అలరారుతోంది.

● 2 రోజులే అభిషేకాలు

యేటా శివరాత్రి పర్వదినాన లింగోద్భావకాలంలో, నవరాత్రి మహోత్సవాలలో మహర్నవమి రోజున రాత్రి వేళ మల్లికార్జునుడికి దక్షిణావృత శంఖముతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకం, కామాక్షితాయికి శ్రీసూక్త విధానంతో (పులకాపు) అభిషేకం నిర్వహిస్తారు. ఈ 2 రోజులు పరమ పవిత్రమని ఆలయ పురోహితుడు శ్రీధర్‌శర్మ తెలిపారు. పవిత్ర పెన్నానదిలో స్నానం చేసి ఈ పూజల్లో పాల్గొన్నా, ఆలయంలో నిద్రించినా సకలపాపాలు, రుగ్మతలు, బాధలు తొలగి అనంతకోటి పుణ్యం లభించడంతో పాటు కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి.

● విస్తృత ఏర్పాట్లు

జొన్నవాడ ఆలయానికి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆలయంలో లింగోద్భవకాల పూజలతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకంతో స్వామివారికి పంచామృత అభిషేకం, శ్రీసూక్త విధానంతో అమ్మవారికి (పులకాపు) అభిషేకం నిర్వహించనున్నారు. భక్తుల కోసం పండరి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదములు, అన్నదాన సదనంలో భోజనాలు, మజ్జిగ, మంచినీరు, చలువపందిళ్ళు తదితర ప్రత్యేక ఏర్పాటు చేసినట్టు ఈఓ ఏవీశ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## రామతీర్థంలో ఏర్పాట్లు పూర్తి

విడవలూరు : ప్రముఖ శైవక్షేత్రమైన రామతీర్థంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, రాత్రి లింగోద్భావకాల అభిషేకం, స్వర్ణ నందిసేవ జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారని, శివరాత్రి రోజున జాగరణ చేసే భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో, సముద్ర తీరంలో ఎస్ఐ నరేష్‌కుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యుద్దీప వెలుగుల్లో రామలింగేశ్వరస్వామి ఆలయం

## బ్రహ్మదేవంలో..



ముత్తుకూరు : విద్యుద్దీప వెలుగుల్లో సిద్ధేశ్వరస్వామి ఆలయం

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురాతన కృష్ణపట్నం సిద్ధేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మదేవంలోని కైలాసనాదేశ్వర స్వామి ఆల యం ముస్తాబవుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్ల వేయడంతోపాటు విద్యుత్ దీపాలంకరణ పూర్తి చేశారు. భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశారు. కృష్ణపట్నం సిద్ధేశ్వ రాలయంలో బుధవారం రుద్రాభిషేకాలతో మొదలై అమ్మవారికి పూలంగి సేవ, స్వామి వారికి నందిసేవ జరుగుతుంది. గురువారం శాంతిలీలా కల్యాణం, గ్రామోత్సవం, శుక్రవారం 27 రకాల విశేష ద్రవ్యాభిషేకం, అన్న లింగ ప్రతిష్ఠతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. బుధవారం రాత్రి భక్తుల కోసం భారీ అన్నదానం నిర్వహిస్తున్నామని కోవూరు జనార్ధర్‌రెడ్డి తెలిపారు. అలాగే బ్రహ్మదేవంలోని కైలాసనాదేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు స్వామివారికి పలు రకాల అభిషేకాలు, విశేషాలంక రణలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపక సభ్యులు కొత్తపల్లి రమేష్‌శర్మ తెలిపారు.

● వెంకటాచలం : మండలవ్యాప్తంగా శివాలయాలు అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. సర్వేపల్లి, కాకుటూరు, అడవిలోని శివాలయం, కసుమూరు, కనుపూరు, ఎగువమిట్ట, పాలిచర్లపాడు, పూడిపర్తి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే శివాలయాలను రకరకాల పుష్పాలు, విద్యుత్ అలంకారాలతో ముస్తాబు చేశారు.

## కాటేపల్లి శివాలయం



ముస్తాబైన కాటేపల్లి శివాలయం

తోటపల్లిగూడూరు : మండలంలోని కాటేపల్లిలో కొలువైన కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం ముస్తాబయింది. ఈ ఆలయంలో బుధవారం నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు శివరాత్రి రోజున స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో జాగరణ చేసి వేకువజామున సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఆలయ ప్రాంగణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు. కాగా భక్తుల రాకపోకలకు నెల్లూరు నుంచి కాటేపల్లికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

## సిద్ధనకొండూరులో ప్రభలే ఆకర్షణ



ప్రత్యేక ఆకర్షణలో ప్రభలు



15 అడుగుల ఎత్తయిన శివుడి విగ్రహం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి) : చుట్టూ ఎత్తయిన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో సిద్ధనకొండూరు గ్రామంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం సుమారు 300 సంవత్సరాల నాటిది. యేటా మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోటప్పకొండ తరువాత ఈ దేవాలయం వద్ద ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ అలంకారాలతో ప్రభలు కనువిందు చేస్తాయి. సిద్ధనకొండూరు కొండపై సిద్దేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యప్పస్వామి దేవాలయం, గంగమ్మ, కాలభైరవుడు, చండీశ్వరుడు, ఆలయాలు ఉన్నాయి. సుమారు 15 అడుగుల శివుడి విగ్రహం ఇక్కడి ప్రత్యేకత. ప్రత్యేక అభిషేకలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయి.

## త్రివేణి సంగమమే.. సంగమక్షేత్రం



ముస్తాబయిన సంగమేశ్వరాలయం

సంగం : పెన్నానది, బొగ్గేరు, బీరాపేరు కలయికతో త్రివేణి సంగమమే సంగమ క్షేత్రంగా, దక్షిణకాశీగా పిలవబడుతున్న సంగమేశ్వరాలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమవుతోంది. త్రేతాయుగంలో పరశురాముడు పాపవిమోచనార్థం ప్రతిష్ఠించబడిన 101 శివలింగంగా చరిత్ర చెబుతోంది. గీతా జ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జరిగే మహాశివరాత్రి వేడుకకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు వేదపండితులు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పినాకినీ నదీస్నానంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత స్వామివారికి క్షీరాభిషేకం, శ్రీమద్భగవద్గీతా పారాయణము జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి శాంతి కల్యాణం రాత్రి 10 గంటలకు నందిసేవ, 10.30 గంటలకు లింగోద్భవకాల మహారుద్రాభిషేకం, తరువాత శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనతోపాటు ఆలయంలో రాత్రంతా భజనతో జాగారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయి.

## స్వర్ణలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద వెలసి ఉన్న స్వర్ణలింగేశ్వరాలయంలో మంగళవారం శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, కలిశస్థాపన, ఏకరుద్రాభిషేకం నిర్వహించారు. ప్రదోషవేళ (సాయంత్రం) నందీశ్వరస్వామికి అభిషేకం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, విశేష దేవతలకు హోమాలు అర్చకులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు పీ.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 27 వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమాలను విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

కావలి (టౌన్) : పాతూరులోని ప్రాచీన శివాలయంలో వెలసివున్న దుర్గాభ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వేడుకగా జరగను న్నాయి. వంశపారంపర్య ఆలయ ప్రధాన అర్చకుడు శశి గురుకుల్ పర్య వేక్షణలో తెల్లవారుజాము 4గంటల నుంచే సర్వదర్శనం ప్రారం భం కానుంది. భక్తులు ఇబ్బంది పడ కుండా దర్శనం సజావుగా సాగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం విద్యుదీపాలంకరణలో దగదగ మెరిసిపోతోంది. అర్ధరాత్రి 1గంటకు మహాలింగోద్భవం అనంతరం మహానంది గ్రామోత్సవం జరగనుంది.



కావలి: విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్న శివాలయం

● లింగసముద్రం : మహాశివరాత్రి పండుగకు మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తరలివచ్చే భక్తుల కోసం నిర్వాహ కులు అన్ని సదుపాయాలు పూర్తి చేశారు. ఈ ఆలయాలను విద్యుద్దీ పాలతో అందంగా అలంకరించారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంతరాలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కావలి, కందుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడవనున్నాయి.

## వైభవంగా సుందరేశ్వరుడికి రావణసేవ

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం రాత్రి రావణసేవ వైభవంగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ, కోడి ముద్దల నివేదన, కలిశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, మహానివేదన, మంత్ర పుష్పం, నీరాజనం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయ ణం, నాద స్వర కచేరీ జరిగాయి. కుంభహారతులు, మంత్ర పుష్పనీరాజనాలు కనుల పండువగా జరిగాయి. ఈ ఉత్సవాలను జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు.



మీనాక్షి సుందరేశ్వరస్వామికి నిర్వహించిన రావణసేవ

## న్యూస్ బాక్స్

### జాతీయ హాకీలో మహిళలు సత్తా చాటాలి : డీఎస్‌డీవో

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీల్లో మహిళల రాష్ట్ర జట్టు సత్తా చాటాలని నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే.యతిరాజ్ అన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళల హాకీ రాష్ట్ర జట్టు శిక్షణ ముగింపు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏసీ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన వివిధ జిల్లాల క్రీడాకారిణులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారిణీలు ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి, హర్యానాలో మార్చి 1 నుంచి 12 వరకు జరిగే జాతీయ పోటీల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికైన రమ్య (శ్రీకాకుళం), మేరీభవానీ కుసుమ (అనకాపల్లి), లక్ష్మీరేవతి (అనంతపురం), వరాలమ్మ నందిని(కాకినాడ), కళ్యాణి (విశాఖ), పావని(సత్యసాయి), హారతి నందిని (కడప), దుర్గాభవాని (ఎన్‌టీఆర్), రుక్మిణి (తిరుపతి), ప్రగతి శ్రావణి (నెల్లూరు), ముజియ బేగం (ప్రకాశం)లను అభినందించి, క్రీడాదుస్తులను, పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి నాయక్, నెల్లూరు ఎంఈవో తిరుపాల్, ఎంసీహెచ్ హెచ్‌ఎం. కృష్ణయ్య, జిల్లా హాకీ సంఘం డైరెక్టర్ థామస్‌పీటర్, కార్యదర్శి జగన్, జట్టు కోచ్ అనిల్‌కుమార్, మేనేజర్‌లు రవికుమార్, రమ్య, జిల్లా హాకీ కోచ్ చందు, పీఈటీలు జీడీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అడ్వకేట్స్ యాక్ట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన అమెండ్‌మెంట్స్‌కు వ్యతిరేకంగా గురు,శుక్రవారాల్లో కోర్టు విధులను బహిష్కరించి, నిరసన తెలియజేయాలని నెల్లూరు బార్ అసోసియేషన్ కమిటీ తీర్మానించినట్టు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్‌వీఎల్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సమావేశమైన బార్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నదని, ఈ ఆందోళనకు న్యాయాధికారులు, న్యాయవాదులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### బెదిరింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళతో పాటు ఆమె కుమార్తెను గొడ్డలితో చంపేస్తానని బెదిరించిన ఓ వ్యక్తిపై నెల్లూరు వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని కొండాయపాలెంకు చెందిన పద్మమ్మ, నాగేశ్వరరావు దంపతులు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. 2014లో నాగేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందాడు. పద్మమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆమెకు, ఆమె బావ కుమారుడు వెంకటరామయ్య కుటుంబానికి మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి వెంకటరామయ్య తన పిన్ని ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, గొడ్డలితో కిటికీ, తలుపులు పగులగొట్టేందుకు యత్నించాడు. అడ్డుకున్న పద్మమ్మ, ఆమె కుమార్తెను చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితులు మంగళవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### దాడి కేసులో నిందితుల అరెస్టు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెంలో సోమవారం తమ్మిరెడ్డి వెంకటశేషయ్యతోపాటు పలువురి ఇళ్లపై దాడిచేసి పలువురిని మారణాయుధాలతో కొట్టి గాయపరచిన కేసులో 9మంది నిందితులను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్టు ఎస్‌ సంతోష్‌రెడ్డి తెలిపారు.

## పురపాలనలో ఆప్కాస్ కలవరం

- ఉద్యోగ భద్రత ఉండదని భయం
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- మెరుగైన అవకాశం కల్పించాలని డిమాండ్

కావలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ తదితర శాఖల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను ఎప్పుడు తొలగిస్తారో.. వారి స్థానంలో కొత్తవారిని ఎవరిని చేర్చుకుంటారో.. ఎన్నినెలలకు జీతాలిస్తారో అర్థమయ్యేది కాదు. కాంట్రాక్ట్ ఏజెన్సీల చేతుల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నందున వారికి ఉద్యోగ భద్రత గాలిలో దీపంలా మారింది. అయితే వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక గుడ్డిలో మెల్ల అన్నట్లుగా ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఆఫ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్)లో వారిని చేర్చారు. గతంలో కార్మికులకు ప్రైవేట్ ఏజెన్సీలతో జీతాలు వస్తుండగా ఆప్కాస్‌లో చేర్చాక ట్రెజరీ నుంచి ప్రతినెలా ఠంచనుగా వారి బ్యాంకు ఖాతాలలో జీతాలు పడుతున్నాయి. పీఎఫ్, ఈఎస్‌ఐలు కూడా ప్రతి నెలా సక్రమంగా వాటి ఖాతాలకు జమ అవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు రాకపోయినా మిగతా వసతులన్నీ సమకూరుతున్నాయి. ఆప్కాస్‌లో చేరిన వారికి ఒక వెబ్‌సైట్ క్రియేట్ చేసి ప్రతినెలా వారు పనిచేస్తున్న ప్రభుత్వశాఖల అధికారులు వారి జీతాల బిల్లులను అందులో నమోదు చేసి సీఎఫ్‌ఎంఎస్‌కు పంపి అక్కడ పాస్ చేసిన తర్వాత ట్రెజరీకి పంపగా ట్రెజరీ నుంచి నేరుగా వారికి జీతాలు ఇచ్చేవారు. వీరిని తొలగించాలన్నా.. వారి స్థానంలో కొత్త వారిని చేర్చు కోవాలన్నా స్థానిక అధికారుల నుంచి కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రుల అనుమతులు తీసుకోవాల్సి ఉన్నందున ఉద్యోగ భద్రత ఏర్పడింది. దీనికితోడు పర్మినెంట్ ఉద్యోగుల జీతాలతో వీరి జీతాలు లింక్ పెట్టి తొలుత ఆప్కాస్‌లోని వారి జీతాలు బిల్లు పెట్టి అది ఆమోదం పొందిన తర్వాతనే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు చెల్లించేలా నిబంధనలు పెట్టడంతో ప్రతినెలా జీతాలు రావటంతో వారు ఆనందంగా విధులు నిర్వహించేవారు.

**రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం**

ఆప్కాస్‌ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వంలోని మంత్రి మండలి నిర్ణయం తీసుకోవటంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులలో కలవరం మొదలైంది. ఇప్పటివరకు తమ ఉద్యోగాలకు ఢోకా లేదు ప్రతినెలా జీతాలు వస్తుండగా ఆప్కాస్ రద్దు చేస్తే తమకు ఉద్యోగ భద్రత ఉండదనే ఆందోళన మొదలైంది. రాజకీయ నాయకుల జోక్యంతో ఎప్పుడు.. ఎవరిని ఉంచుతారో ఎవరిని తొలగిస్తారో, తమ జీతాలు సక్రమంగా వస్తాయా రావా అనే ఆందోళనతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని లేదంటే ఆప్కాస్ కన్నా మెరుగైన విధానం ఏదైనా ఉంటే దాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. అలా కాకుండా ఆప్కాస్ రద్దు చేసి కాంట్రాక్టర్ల ఏజెన్సీలకు అప్పజెబితే తమ ఉద్యోగానికి భద్రత ఉండదని కాంట్రాక్టర్లకు అప్పగించకుండా అధికారుల పర్యవేక్షణలోనే ఉంచాలని లేకపోతే దీనిపై ఎంత వరకైనా పోరాటాలు చేయక తప్పదంటున్నారు.



వీధులను శుభ్రపరుస్తున్న మున్సిపల్ కార్మికులు

**తప్పులు దొర్లితే కష్టం**

ఆప్కాస్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై స్థానిక అధికారుల నియంత్రణలో లేకుండా పోవడంతో చిన్నపాటి తప్పులు జరిగినా వాటిని పైస్థాయిలో సరిచేయాల్సి ఉన్నందున అది వీలు పడటం లేదని కిందిస్థాయి అధికారులు వాపోతున్నారు. కార్మికులు ఎవరైనా చనిపోయినా లేక అనారోగ్యంతో విధులు నిర్వహించలేక పోయినా వారి స్థానంలో వారి వారసులకు అవకాశం ఇచ్చేందుకు ఆప్కాస్‌లో అవకాశం ఉండటం లేదు. జీతాలు తగ్గినా, పేర్లలో తప్పులు వచ్చినా వాటిని స్థానికంగా సరిచేయలేక పోతున్నందున అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే నష్టపోతున్నారని చెబుతున్నారు.

**అంతకన్నా మెరుగ్గా చూపించాలి**



ఆప్కాస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అంతకన్నా మెరుగైనది కల్పించాలి. ఆప్కాస్‌తో ఉద్యోగ భద్రతతో పాటు ప్రతినెలా జీతాలు వస్తున్నాయి. ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పచెప్పితే ఉద్యమం తప్పదు.

- మల్లి అంకయ్య, మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు

**పర్మినెంట్ చేయాలి**



ఆప్కాస్‌ను రద్దు చేయాలనుకుంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి. ఉద్యోగభద్రత లేకుండా ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఎంతటి పోరాటానికైనా కార్మికులు సిద్ధపడతారు.

- పసుపులేటి పెంచలయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కావలి శాఖ గౌరవాధ్యక్షుడు

**ఉద్యోగ భద్రత కల్పించండి**



ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత తగ్గుతోందని. ప్రతి నెలా జీతాలు సక్రమంగా రావనే భయం ఉంది. పాలకులు స్పందించి కార్మికులకు మంచి జరిగే నిర్ణయం తీసుకోవాలి.

- కుమారమ్మ, మున్సిపల్ కార్మికురాలు

## అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలి

- కావలిలో న్యాయవాదుల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, న్యాయవాదుల గుమాస్తాలు




కావలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కావలిలో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని కావలి బార్ అసోసిషన్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు సెంటర్ నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేష న్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి, కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడారు. కావలి కోర్టుకు మంచి చరిత్ర ఉందని గతంలో ప్రకాశం జిల్లా ఏర్పడక ముందు కావలి కోర్టు పరిధి పెద్దదిగా ఉండిందన్నారు. కావలి కోర్టు గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని కావలిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. ప్రతి దానికి జిల్లా కోర్టు కోసం నెల్లూరు వెళ్లాలంటే చాలా దూరం ఉన్నందున కక్షిదారులు, న్యాయవాదులకు అదనపుభారం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కావలిబార్ న్యాయవాదులు యల్లంటి వెంకటేశ్వర్లు, సాయిప్రసాద్, అభిషేక్, జగన్మోహన్,పలువురు న్యాయవాదుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీపీలుగా సుందరయ్య, చంద్రశేఖర్



సుందరయ్య



చంద్రశేఖర్

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఏపీపీలు)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది మద్దిబోయిన సుందరయ్య యాదవ్‌ను నెల్లూరు ఆరవ అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు) అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఈయన 1993 నుంచి న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ప్రస్తుతం నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. స్వంత డబ్బు వెచ్చించి బార్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడ్డారు. మరో సీనియర్ న్యాయవాది దూబిశెట్టి చంద్రశఖర్ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు (స్పెషల్ కోర్టు) అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈయన 2001 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. అందరితోనూ కలుపుగోలుగా ఉంటారు. వీరిద్దరి పదవీకాలం మూడేళ్లు. వీరికి ప్రభుత్వం నెలకు రూ. 40వేలు గౌరవ వేతనం చెల్లిస్తుంది. వీరి నియమామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## ‘వెలుగొండ’ నిర్మాణం పూర్తి చేయాలి

- బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వెలుగొండ ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వెలుగొండ ప్రాజెక్టుపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం జిల్లాలోని కరువు ప్రాంతాలకు సాగు,తాగునీరు అందుతుందన్నారు. జిల్లాలో వెనుకబడ్డ ఉదయగిరి ప్రాంతానికి, కడపజిల్లా బద్వేలు ప్రాంతంలోని 30 మండలాలలోని 15 లక్షలమందికి తాగునీరు, 4.59 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకాలు వేస్తున్నారేకానీ, పనులు ప్రారంభించేందుకు అవసరమైన నిధులు కేటాయించటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత అజయ్‌కుమార్, రైతు సంఘ నాయకుడు మూలి వెంగయ్య, కార్మిక సంఘం నేతలు వెంకమరాజు, పుల్లయ్య, ఐద్వా నాయకులు శివకుమారి, మస్తాన్‌బీ, ప్రజానాట్యమండలి కార్యదర్శి శేషయ్య, సీపీఎం నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌గా మహమ్మదాపురం హైస్కూల్

- కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పొదలకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురం హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం మహమ్మదాపురంలో దొడ్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా నిర్మించిన దొడ్ల శంకరమ్మ హాస్టల్ బ్లాక్‌ను కలెక్టర్ సమక్షంలో ప్రభుత్వానికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో దొడ్ల కుటుంబం సేవలను కొనియాడారు. రాబోయే రెండు, మూడేళ్లల్లో పక్కపక్కనే ఉన్న జడ్పీ హైస్కూల్, ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి మోడల్ స్కూల్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, విశాలమైన క్రీడా మైదానంలో వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్ కోర్టులు, మోడల్ కిచెన్ వంటి అత్యాధునిక వసతులను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. దీనికి దాతలు, గ్రామస్థులు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు 800 నుంచి వెయ్యి మంది విద్యా ర్థులు ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యా యులు, గ్రామస్థులకు సూచించారు. దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఏదైనా చేయాలనే తపన ఉన్న కలెక్టర్ జిల్లాకు రావడం మన అదృష్టం అన్నారు. అనంతరం కలెక్టర్ హాస్టల్ గదులను, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణదా తలు, దొడ్ల డెయిరీ ఎండీ దొడ్ల సునీల్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు వెంకటలక్ష్మమ్మ, శోభారాణి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కొత్తగా ఎంపికైన ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘ కార్యవర్గం

## ఎక్సైజ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం ఎన్నికలు నగరంలోని నెల్లూరు క్లబ్‌లో మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ ఎం. బాలక్రిష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్‌ఐ డీ. శ్రీధర్, జనరల్ కార్యదర్శిగా ఎస్‌ఐ ఎస్.ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇన్ స్పెక్టర్ సుంకర శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీగా ఎస్‌ఐ ఎస్‌కే మహబూబ్‌బాష ఎంపికయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఇన్‌స్పెక్టర్‌లు పీ. ప్రసన్నలక్ష్మి, టీ. లక్ష్మణస్వామి, ఎస్‌డీ ఖాలే షావలి, ఎస్‌ఐలు ఎస్‌డీ అబ్దుల్‌జలీల్ అహ్మద్, ఏ శేషమ్మ, ఓ ప్రతాప్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

## భర్త, అత్తింటివారిపై కేసు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధింపు లకు గురిచేస్తూ దాడిచేసిన భర్త, అత్తింటివారిపై పోలీసులు కేసు నమో దు చేశారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు బీవీనగర్‌కు చెందిన అరుణకు 2017లో ప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారు డు. ప్రసాద్ వేరే మహిళలతో సన్నిహి తంగా ఉంటూ భార్యను వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయంపై బాధితురాలు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈ నేపధ్యంలో ఇటీవల ఓ మహిళతో ఫోన్‌లో మాట్లా డుతుండగా భార్య నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన ప్రసాద్ భార్యపై విచ క్షణా రహితంగా దాడిచేశారు. ఈ విషయమై అరుణ కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని ప్రశ్నించడంతో వారిపై సైతం ప్రసాద్ దౌర్జన్యానికి దిగాడు. భర్త, అతడికి సహకరిస్తున్న అత్తింటివారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మంగళవారం వేదాయపాలెం పోలీసు లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 86 |
| లేయర్ లైవ్ | 75 |
| స్కిన్ చికెన్ | 162 |
| స్కిన్‌లెస్ | 182 |
| లేయర్ | 127 |

## బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.8341 |
| వెండి కిలో ధర | రూ. 98,700 |
| వెండి ఒక గ్రాము | రూ.101.70 |

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వెంకటాచలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడ్లూరువారిపాళెం పంచాయతీ దిగువవెంకట్‌రెడ్డిపాళెం సమీపంలో ఉన్న నక్కల కాలువ వద్ద మంగళవారం ఓ గుర్తుతెలియని ఓ మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కాలువ పక్కనే పడి ఉండడాన్ని అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని క్షుణంగా పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గొలుసు చోరీ కేసులో నిందితుడి పట్టివేత

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలితో మాటలు కలిపి, మీ ఇంటి వద్ద దించుతానని స్కూటీ ఎక్కించుకొని, ఆమె వద్ద నుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి దోచుకెళ్లాడు. బాధితు రాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, గంటల వ్యవధిలోనే అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల కథనం మేరకు, నగరంలోని నవాబుపేట కొత్తవీధిలో బీ రాజేశ్వరి కుటుంబం నివాసం ఉంటున్నది. ఆమె ఈనెల 24న మధ్యాహ్నం ఆత్మకూరు బస్టాండు సమీపంలోని పూలమార్కెట్‌కు వెళ్లింది. పూలు కొనుగోలు చేసి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి స్కూటీ ని ఆమె వద్ద నిలిపాడు. 'నేను మీ దూరపు బంధువు లక్ష్మి కుమారుడిని.. బాగున్నారా'.. అంటూ మాటలు కలిపాడు. అవునా.. అని ఆ వృద్ధురాలు అనగానే, మాటలు కలిపి మీ ఇంటి వైపే వెళుతున్నాను స్కూటీ ఎక్కండి వదిలి పెడతాను.. అన్నాడు. దీంతో వృద్ధురాలు స్కూటీ ఎక్కింది. మార్గమధ్యంలో 'నేను బంగారు పనిచేస్తుంటా... మీ మెడలోని బంగారు గొలుసు కేడీఎంలా లేదు' అని వృద్ధురాలికి అనుమానం వచ్చేలా ప్రశ్నలు వేశాడు. గొలుసు ఇస్తే కేడీఎం చేసి ఇస్తానని నమ్మించాడు. దీంతో ఆమె గొలుసు తీసి ఇచ్చింది. ఆమెను కుమ్మరివీధి వద్ద స్కూటీ నుంచి దించి గొలుసు చూస్తున్నట్లు నటిస్తూ స్కూటీ వేగం పెంచి పరారయ్యాడు. బాధితురాలు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. అంతేకాక మంగళవారం నవాబుపేట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రహమాన్ కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారంగా గంటల వ్యవధిలోనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతను బీటెక్ చదివి ఉద్యోగ వేటలో ఉన్నాడని, ఖర్చుల కోసం గొలుసు దొంగలించినట్లు తెలిసింది.

ఆధ్యాత్మిక ధ్యానమే

# శివలింగ పూజ



నవదుర్గల అలంకరణలో అమ్మవార్లు

● బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివరాత్రి వేడుకలు

అల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ధ్యానమే శివలింగ పూజ చేసినట్టని, త్రిమూర్తి శివపరమాత్మ అవతరించిన పర్వదినమే మహాశివరాత్రి అని నగర పంచాయతీ కమిషనర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. స్థానిక పేటలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించే వేడుకల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిత్య జలాభిషేక శివలింగం.. నందీశ్వరుడిని ఏర్పాటు స్థానికులను ఆకర్షించింది. అలాగే నవదుర్గల నడుమ వజ్రలింగంను ఏర్పాటు చేశారు. అనంతరం చేపట్టిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, గుడిపాటి ప్రసాద్, నాగేశ్వరరావు, సిద్దా యానాదిశెట్టి, సిద్దా రామకృష్ణ, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కపల్లి విశ్వేశ్వరాలయంలో బీద రవిచంద్ర పూజలు

అల్లూరు : ఇస్కపల్లి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో మంగళ వారం రాత్రి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సుజన దంపతులు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న బీద రవిచంద్ర, బీద గిరిధర్

బిట్రగుంట : మండలంలోని ఆలయాల్లో మంగళవారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభించారు. నాగులవరం గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతిపూజ అనంతరం విగ్రహదాతలు మరసా క్రాంతి కుమార్, మాధవి దంపతులు రుద్రాభిషేక ఉభయకర్తలుగా వ్యవహరించారు. మాజీ సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, సౌజన్య దంపతులు త్రిశూల పూజ, లఘు పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఉభయకర్తలు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు. విశ్వనాథరావుపేట రామస్వామిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ముత్తు కామాక్షిరెడ్డి, సుం దరవల్లి దంపతులు పూజాభిషేక ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## మల్లన్నకు రావణసేవ

●కావలి టౌన్ : పాతూరులోని రుద్రపాద క్షేత్రంలో దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారికి మంగళవారం రావణేశ్వర వాహన సేవ లందించారు. ప్రధాన అర్చకులు శశిగురు కుల్ పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకు లు ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల సుబ్రమణ్వేరశర్మ రుద్రాక్ష మహిమ ప్రవచనం గావించారు.



సంగం: రావణుడి విగ్రహంపై ఊరేగుతున్న భీమేశ్వరస్వామి

●సంగం : మండలంలోని వంగల్లులో ఉన్న భీమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున భీమేశ్వరుడి రావణసేవ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని రావణాసురుడి విగ్రహంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

# మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

● వైభవంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
● భద్రతా చర్యల్లో పోలీసు యంత్రాంగం

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శివాలయాలు బుధవారం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్ళతిప్పలో ఉన్న కాశీనాయన ఆశ్రమం, పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం, శ్రీనివాసేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని పలు ఆలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

### పటిష్ట బందోబస్తు: ఆత్మకూరు సీఐ గంగాధర్

మహాశివరాత్రి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశాం. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే శైవక్షేత్రాల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఎన్‌సీసీ వలంటీర్లను సైతం భద్రత ఏర్పాట్లకు నియమించాం. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వర ఆలయాల వద్ద సీఐతోపాటు ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లను నియమించాం.

●ఉదయగిరి రూరల్: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానంగా మండలంలోని గండిపాళెం జలాశయ ప్రాంగణంలో



శివరాత్రి వేడుకలకు ముస్తాబైన తిరునాళ్లతిప్పలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం

ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంతో పాటు వరికుంటపాడు, నారసింహాపురం, పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు తదితర గ్రామాల ఆలయాలను తీర్చిదిద్దారు.

●జలదంకి : స్థానిక గంగా సమేత జానకి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఉత్సవకమిటీ సభ్యులు శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్ కూడలిలో శివపార్వతలను విద్యుత్ దీపాలతో ఉండే భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, ఈఓ మస్తాన్‌బాబు, ఉత్సవ కమిటీ అద్యక్షుడు కూరపాటి దయాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

కావలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా మహాశివరాత్రి వేడుకలు ఉంటాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉపవాసాలు, జాగరణతో పరమశివుడిని పూజిస్తే మేలు జరుగుతుందన్నారు. శివపార్వతుల ఆశీస్సులతో కావలి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

## ఉపాధి పనులపై సోషల్ ఆడిటింగ్

బిట్రగుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో అధికారులు ఉపాధి పనులపై బహిరంగ సోషల్ ఆడిటింగ్ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల కూలీలు, మెటీరియల్‌కు సంబంధించి రూ.7.45కోట్ల పనులకు సంబంధించి ఆడిటింగ్ డీవీవో విజయలక్ష్మీ, ఏపీడీ మృదుల రికార్డులు పరిశీలించారు. వాలం టర్లు చేయాల్సిన పనిదినాలకన్నా అధికంగా వచ్చినవి, హాజరు పట్టికలో పొరపాట్లు, గణాంకంలో జరిగిన తప్పులు రూ.1.85లక్షలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏపీవో శ్రీనివాసులు, ఎస్‌ఆర్పీ బుజ్జి ఉన్నారు.

## పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ సూచించారు. మంగళవారం గండిపాళెంలోని లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. నిర్మాణ దశలను బట్టి రోజుల వ్యవధిలోనే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, జనసేన నాయకులు షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్ : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

### లబ్ధిదారులకు ఆర్థిక సాయం : పీడీ

కలువాయి : ప్రస్తుతం హౌసింగ్ స్కీంలోని ఎస్సీ, ఎస్టీ, చేనేత వర్గాలకు చెందిన లబ్ధిదారులకు సబ్‌ప్లాన్ ద్వారా అదనపు ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అయితే ఇందుకు సంబంధించి జీవో రావల్సి ఉందని జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వంతంగా ఇళ్లు కట్టుకునే పేదలు యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతు న్నారని ప్రభుత్వం దృష్టికి పోవడంతో ప్రస్తుత యూనిట్ కాస్ట్ రూ.1.80లక్షలకు అదనంగా ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, చేనేతలకు రూ.50వేలు అదనంగా సబ్‌ప్లాన్ ద్వారా ఆర్థికసాయం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలోని వివిధ లేఅవుట్‌లలో 160 మంది కాంట్రాక్టర్లకు అప్పగించిన 25వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం ముందుగా 53 మంది క్లీన్‌చిట్ ఉన్న కాంట్రాక్టర్ల జాబితా తయారు చేసి జిల్లా కలెక్టరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పీఎంఏవై 2.0కు జిల్లాలో ఇళ్లులేని అర్హులైన పేదలు 51వేల మందిని గుర్తించి హౌసింగ్ పోర్టర్‌లో నమోదు చేసినట్లు చెప్పారు.

## ఎమ్మెల్యే కాకర్లపై దుష్ప్రచారం తగదు : పొన్నెబోయిన

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై తప్పుడు ప్రచారం సరికాదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం తన అతిథిగృహంలో టీడీపీ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, గండిపాళెం జలాశయం చైర్మన్ ఏ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, గడ్డం వెంకటేశ్వర్లు, తుమ్మల కిరణ్, నవాజ్, ఉప్పుటూరి పెదవెంకటయ్య, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్య ఆరోపణలను మానుకోవాలని మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు ప్రచారం నిర్వహించే నాయకులకు త్వరలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కొండాపురం: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అవినీతి ఆరోపణలు చేస్తే సహించేది లేదని కొమ్మి గ్రామ టీడీపీ యువ నాయకుడు అంబటి సురేంద్ర అన్నారు. ఈ విషయంపై మంగళవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎక్కడో కూర్చొని అవినీతి ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇకపై ఉపేక్షించం అన్నారు.

## 3లోపు ఈపంట నమోదు చేయించుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రబీలో వరి పంట సాగు చేసిన రైతులు మార్చి 3వ తేదీ లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ కోరారు. మంగళవారం ఆమె మండలంలోని మహిమలూరు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కోత దశలో ఉన్న వరి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈపంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి కావలసిన పత్రాలు అందచేసి యూనిక్ నెంబరు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో, వీఏవో, రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ

●ఉదయగిరి : మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ షరీఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### 5545 మందికి పీఎం కిసాన్ లబ్ధి

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలో 5545 మంది రైతులకు పీఎం కిసాన్ లబ్ధి చేకూరినట్లు వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం రామాపురం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగదు జమకాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి తీవ్రగాయాలు

జలదంకి : జలదంకి-జమ్మలపాలెం మధ్య 167బిజి నంబరు జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జలదంకి వైపు నుంచి వస్తున్న ఆటోను కావలి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న కలిగిర మండలం నాగిరెడ్డిపల్లికు చెందిన రాజశేఖర్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు గాయపడ్డ యువకుడిని జాతీయరహదారి నిర్మాణ పనుల్లో ఉన్న వాహనంలో చికిత్స నిమత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా తెలిపారు.

## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ల పంపిణీ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో అంగన్‌వాడీల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఎంఈవో సాయిప్రసాద్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్స్‌గా గరిసిపాటి సుబ్బయ్య, జగదీష్ కుమార్‌రెడ్డి, మేకల వెంకటేశ్వర్లు వ్యవ హరించారు.

●కలిగిరి: మండలంలో ఆరురోజులుగా జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ మంగళవారంతో ముగిసింది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సీడీపీఓ పద్మజకుమారి మధురస్మృతిగా మామిడి మొక్క నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ జీ.సురేష్, హెచ్‌ఎం భీమేశ్వరరావు, స్కూల్ అసిస్టెంట్ సుగుణమ్మ, డీఆర్పీలు శేషగిరిరావు, లక్ష్మయ్య, మీనయ్య, గాదిశెట్టి మురళీకృష్ణ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## జలాశయాలకు నిధులు కేటాయించాలి : సీపీఎం



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆటోనగర్‌లో కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా పాలకులు, అధికారులు పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

### జీవో 117ను రద్దుచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి ఆటంకంగా మారిన 117 జీవోను రద్దుచేయాలని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ మంగళవారం మండల ఆవాజ్ కమిటీ తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఆవాజ్ కమిటీ సభ్యులు ఖాజావలి, విక్రమ్, ఆలంబాష, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

### మహిళా కళాకారులకు శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలోని చెక్కనగిషీ కేంద్రంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా కళాకారులకు బిజినెస్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా మాట్లాడుతూ కేంద్రంలోని 40 మంది మహిళా కళాకారులకు 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఏ కార్యాలయ ప్రతినిధి నాగేంద్రప్రసాద్, కేంద్రం నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్, గౌసియా పాల్గొన్నారు.

### పెంచలకోన రోడ్డు మరమ్మతు పనుల ప్రారంభం

చేజర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి నుంచి పెంచలకోన వరకు రోడ్డు మరమ్మతు పనులకు రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి దాదాపు రూ. 34లక్షల నిధులు మంజూరు చేయించడంతో సంబంధిత అధికారులు సోమవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### సర్వేలపై సమీక్ష

సీతారామపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన మంగళవారం మండల సచివాలయ సిబ్బందితో సర్వేలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిధిలోని సచివాలయలలో జరుగుతున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు రాంనాథరెడ్డి, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

సంగం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల డేటాఎంట్రీ, టెక్నికల్ అసిస్టెంట్‌లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ సుమతి ధాన్యంలో తేమ, తాలు, మట్టి పెళ్లలు, ఇతర వ్యర్థాలు గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోవ్వూరు సబ్ డివిజన్ సహకార సంఘం అధికారి సుభాషిణి, సంగం, దువ్వూరు పీఏసీఎస్‌ల సెక్రటరీలు దస్తగిరి, వెంకటరమణయ్య, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

కలువాయి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, కాపు, ఈబీసీలకు సబ్సిడీ రుణాల మంజూరుకు జరిగిన ఇంటర్వ్యూలకు 265 మంది హాజరైనట్లు ఎంపీడీవో భవాని తెలిపారు. మొత్తం 408 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 265 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

### తడి, పొడి చెత్త అందించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు అందించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. మంగళవారం ఈవోపీ ఆర్డీ కరీముల్లాతో కలిసి మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల్లో ఆగిన సేవలు!

**● 8 రోజులుగా విద్యుత్ కట్ ● వెలగని వీధిలైట్లు ● రెండు రోజుల్లో బిల్లులు చెల్లించకుంటే తాగునీటి ఎద్దడి ● ఆందోళనలో పొదలకూరు ప్రజలు**

పొదలకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు పొదలకూరు మేజర్ గ్రామ పంచాయతీ రూ.3.60 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో 8 రోజుల క్రితం పంచాయతీ కార్యాలయంతో పాటు నాలుగు సచివాలయాలకు, పంచాయతీకి చెందిన సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన విషయం విదితమే. అప్పటి నుంచి సచివాలయాల్లో ప్రజలకు అందాల్సిన పలురకాల సేవలు పూర్తిగా స్తంభించాయి. చివరకు రాత్రుళ్ల వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో పొదలకూరు పట్టణంలో అంధకారం నెలకొంది. గత ఐదేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించి కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. వారి నిర్వాహకం కారణంగా ప్రస్తుతం అధికారం నెలకొన్నా వైసీపీ పంచాయతీ పాలకవర్గం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో రెండు రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించకుంటే తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడాల్సి పరిస్థితి పొంచివుంది. కాగా పంచాయతీ ఖాతాలో ఉన్న రూ.50 లక్షల్లో కొంత కరెంటు బిల్లు చెల్లించకుండా పాలకవర్గం కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే ఏ సర్టిఫికెట్ కావాలన్నా కరెంటుతో పని ఉండడంతో కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందలేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కరెంటు లేదన్న సాకుతో సచివాలయ ఉద్యోగులు కూడా సక్రమంగా కార్యాలయాల్లో ఉండడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శీనయ్య మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయమై చర్చిస్తున్నామని, రూ.20లక్షల చెల్లించేలా చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు.



విద్యుత్ లేక ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యాలయం

# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పొదలకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని చోళుల కాలం నాటి పురాతన శివాలయంలో బుధవారం నుంచి వచ్చే నెల 2వతేదీ వరకు శ్రీకామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కోడూరు శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కోడూరు మస్తానయ్య, ప్రత్యూష, భక్తులు పాల్గొన్నారు.

## కోవూరు శివాలయం ముస్తాబు

కోవూరు : శివరాత్రి సందర్భంగా స్థానిక శివాలయాన్ని మంగళవారం ముస్తాబు చేశారు. చోళుల కాలం నాటి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన ద్వారాల్ని పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేసేందుకు వీలుగా ధర్మకర్తలి మండలి సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య బుధవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలకు కార్యక్రమం రూపొందించుకున్నారు.



కోవూరు : శివరాత్రికి ముస్తాబైన కోవూరు శివాలయం

## శివరాత్రికి సూక్ష్మచిత్రాలు

నెల్లూరు(సాంస్కృతికం) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా ముత్తుకూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు సోమా పద్మారత్నం మర్రి ఆకుపై మహాశివుడి చిత్రాన్ని కార్వింగ్ చేశారు. అలాగే నగరంలోని సుంకుచెంగన్న హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు గంథవళ్ల ఉమాశంకర్ యోగ శివయ్య చిత్రాన్ని మర్రి ఆకుపై కార్వింగ్ చేశారు. భక్తవత్సల నగర్‌కు చెందిన కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు కొబ్బరి చిప్పలతో శివలింగాన్ని రూపొందించారు. శివ రాత్రి సందర్భంగా వారు ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు.




## సామ్నా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ (సామ్నా) కార్యవర్గం ఎన్నికైంది. ఆ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. గౌరవ సలహాదారుడిగా ఎస్.రామారావు, గౌరవ అధ్యక్షుడిగా సింహపురి బాబు, అధ్యక్షుడిగా వేలూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చక్రం దినేష్, ఆర్గనైనింగ్ కార్యదర్శిగా సీహెచ్ మనోహర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.సురేష్, ఎం.శ్రీనివాసులు, మస్తానయ్య, కోశాధికారిగా సునీల్‌గవాస్కర్, ఉపాధ్యక్షులుగా కే.నాగేశ్వరరావు, బీ.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ డబ్ల్యూయూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు గంగా జలాల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం) : డాడీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని అరవిందనగర్ సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహాశివుడికి పాలభిషేకం, పుష్పాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 6 నుంచి కుంభమేళా నుంచి తెచ్చిన పవిత్ర గంగా జలాలు పంపిణీ చేస్తామన్నారు.

# గత ఐదేళ్ల కాకాణి దోపిడీ కనిపించలేదా?

**● మైనింగ్ ఏడీని ప్రశ్నించిన జనసేన పార్టీ సమన్వయకర్త సురేష్‌నాయుడు**

వెంకటాచలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు, దోపిడీ కనిపించలేదా అంటూ మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్‌ను సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ప్రశ్నించారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రెండురోజుల క్రితం సురాయపాళెం రీచ్‌లో ఇసుక లారీలను అదుపులోకి తీసుకున్నట్లు మైనింగ్ ఏడీ సాక్షి మీడియా ద్వారా ఫొటోలు, వీడియాలను విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయంలో కాకాణి కనుసన్నల్లో చిట్టేపల్లి, ప్రభగిరిపట్నం తిప్పలు, వరదాపురంలో రూ.కోట్ల తెల్లబంగారాన్ని అనుమతులు లేకుండానే నాటు బాంబులతో బ్లాస్ట్ చేసి అక్రమంగా తరలించినప్పుడు మైనింగ్ ఏడీ కనిపించలేదే అంటూ ప్రశ్నించారు. మరుపూరు, మొగులూరుల్లో అక్రమ మైనింగ్ జరిగినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఏడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజా సంపదను దోచుకున్న కాకాణి కూడా ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అర్థరహిత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాకాణి మైనింగ్ దోపిడీకి సంబంధించిన ఆనవాళ్లను ఇవిగో అంటూ చూపించారు.

## కనుపూరు చెరువులో చేప పిల్లల విడుదల

వెంకటాచలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపూరు చెరువులో మంగళవారం చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కనుపూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు వల్లూరు రమేష్‌నాయుడు మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలో 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు మేదరమెట్ల కోదండయ్యనాయుడు, వల్లూరు శ్రీనివాసులునాయుడు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు నాయుడు, మొండెం శ్రీనివాసులు, మత్స్యశాఖ అధికారులు తదితరులున్నారు.

# జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు : జేసీ

పొదలకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు 300 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మంగళవారం ఆయన పొదలకూరులోని బిట్-3 సచివాలయం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని నిబంధనలు అనుసరించి తీసుకొస్తే మంచి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఈ ఏడాది రైతులు పండించిన 11.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లతో మాట్లాడి సిద్ధం చేశామన్నారు. పొదలకూరు మండలంలో పొదలకూరు, సూరాయపాలెం, నేదురుపల్లి, తాటిపర్తి, డేగపూడి గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయని స్థానిక వ్యవసాయాధికారులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. వారికి అవసరమైన 7వేల గోనె సంచులు ఇప్పటికే సొసైటీకి చేరాయని వాటిని రైతులకు అందజేయాలని ఆదేశించారు. మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని ఎక్కడా దళారులు పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్లాటుఫారాలు నిర్మించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాబు జేసీని కోరారు. జేసీ వెంట జిల్లా కోఆపరేటివ్ అధికారి గురప్ప, వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్, ఏవో వాసు, ఇన్‌చార్జ్ తహసీల్దారు సురేఖా, సొసైటీ సీఈవో రాధారెడ్డి, తదితరులున్నారు.



రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

# వీఎస్‌యూ అభివృద్ధికి యూబీఐ చేయూత

వెంకటాచలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ ఏ.రాజశేఖరం తెలిపారు. వీఎస్‌యూలో వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో వీఎస్‌యూకి ఎలక్ట్రిక్ కార్లను అందించనున్నట్లు తెలిపారు. దీనిపై వీసీ అల్లం శ్రీనివాసరావు స్పందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే భాగస్వామ్యాలు ఎంతో కీలకమన్నారు.



వీసీ శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న యూబీఐ రీజనల్ హెడ్ రాజశేఖరం

## క్రమశిక్షణ, సమష్టి కృషితోనే విజయం

క్రీడల్లో విజయానికి క్రమశిక్షణ, సమష్టి కృషి చాలా అవసరమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 28న పెరియార్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టు సభ్యులకు వీఎస్‌యూలో మంగళవారం స్పోర్ట్స్ డ్రెస్సు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి వర్సిటీ గౌరవాన్ని మరింత పెంచాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ సుజయ్‌కుమార్, యూనియన్ బ్యాంక్ బీవీ నగర్ బ్రాంచ్ మేనేజర్ రామ్మోహన్, వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు, పీడీలు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ రామయ్య, సిబ్బంది అజయ్ కుమార్, నారాయణ తదతరులు పాల్గొన్నారు.







## కల్పవృక్ష వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణనగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణ వేంకటేశ్వరుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఈమని హరి జ్ఞాపకార్థం రుక్మిణమ్మ ఉభయకర్తగా వ్యవహరించారు.



## అవసరాలకు తగ్గట్టుగా బడ్జెట్ రూపకల్పన : మేయర్

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నగర అవసరాలకు తగ్గట్టుగా బడ్జెట్‌ను రూపొందించాలని ఎన్‌ఎంసీ మేయర్ పీ.స్రవంతి సూచించారు. మంగళవారం ఎన్‌ఎంసీ లోని తన చాంబరులో విభాగాధిపతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి తయారు చేస్తున్న బడ్జెట్‌లో అన్నీ విభాగాలకు తగిన న్యాయం చేయాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు పద్దుల కేటా యింపులు ఉండాలని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలకు మౌలిక సదు పాయాలు కల్పించడంలో బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్లకు నెల్లూరు బడ్జెట్ ఆదర్శంగా ఉండాలని ఆమె తెలిపారు.



అధికారుల సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

## రూ.2 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో కార్పొరేట్ ఆసుపత్రుల తరహా సౌకర్యాలతో పేదలకు మెరుగైన ఉచిత వైద్యసేవలందించడం కోసం రూ.2 కోట్లతో బుచ్చి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మజతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులు, చిన్నపిల్లల అత్యవసర వైద్య సేవల కోసం కావలసిన అధునాతన వైద్య పరికరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిల్ నిధులు రూ.2 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ శివకుమార్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్ల కోదండరామిరెడ్డి, వైద్యులు వెంకటేశ్వర్లు, సహన, అబ్దుల్ సమద్, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెం.117ను రద్దు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 117 నెంబరు జీవోను వెంటనే రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ఆవాజ్ మండల కార్యదర్శి మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బుచ్చి తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించడంతో పాటు సౌకర్యాలు మెరుగుపరచి ఆ పాఠశాలలను కాపాడాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున, నాయకులు జానీబాషా, షబ్బీర్, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు

తోటపల్లిగూడూరు : రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వ్యవసాయాధికారి శిరీషారాణి తెలిపారు. చిన్నచెరుకూరు, ఇస్కపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద తక్కువ ధరకు ధాన్యం విక్రయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రంలో గ్రేడ్ ఏ రకం ధాన్యం ప్రభుత్వ ధర పుట్టి రూ.19,720లకు విక్రయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శివకుమార్, షర్మిల, రైతులు పాల్గొన్నారు.

# జీవితంలో ఎదగడానికి 'పది' పునాది

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతివ్యక్తి జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవడానికి పదో తరగతిలోనే పునాది పడుతుందని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అన్నారు. మంగళవారం సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జడ్పీ హైస్కూల్లో పది విద్యార్థులకు అల్లూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పది చాలా కీలకమన్నారు. విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, చదువే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన తొలి ముగ్గురికి నగదు బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణరావు, హెచ్‌ఎం అన్వర్‌హుస్సేన్, పీహెచ్‌సీ వైద్యుడు అబ్రద్‌హుస్సేన్, ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి మస్తానయ్య, కాకుపల్లి మాజీ సర్పంచి ఉప్పల ఈశ్వరయ్య, హైస్కూల్ చైర్మన్ పెంచలయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మనుబోలు : మండలంలోని వీరంపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం టీడీపీ యువనేతు పొట్టేళ్ల ప్రసాద్, ఆయన సోదరుడు పొట్టేళ్ల మస్తాన్‌లు పరీక్ష సామగ్రి అందజేశారు. వార్షిక పరీక్షలు దగ్గరపడుతుండడంతో 22 మంది విద్యార్థులకు సామగ్రి అందజేశారు. అంతకుముందు పాఠశాలలో సరస్వతీపూజ, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరంపల్లి నీటి సంఘం అధ్యక్షుడు మన్నారపు రఘురామయ్య, పాఠశాల చైర్మన్ గోనుపల్లి అపర్ణ, వైస్‌చైర్మన్ గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పలిగిలి రామకృష్ణ, ఆనాల సుందరయ్య, మోడుబోయిన వెంకటరమణయ్య, హెచ్‌ఎం పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తలుగా ఎదగాలి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞాన పరిశోధనలు చేపట్టి శాస్త్రవేత్తలుగా ఎదగాలని నెల్లూరు ఎంఈవో తిరుపాల్ అన్నారు. బుజబుజనెల్లూరులోని శ్రీనివాసా పాఠశాలలో మంగళవారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వేదాయపాళెం ఏఎస్‌ఐ బీ.మునిరావు, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, కరస్పాండెంట్ సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

విడవలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. విడవలూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో దద్దోలు హరి, నాయకులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

విడవలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 60వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా అధ్యాపకులు తమ విధులను నిర్వర్తిస్తారన్నారు. అనంతరం నిర్వహించని సాంస్కృతిక, క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ గౌతంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# చెత్త ట్రాక్టర్లకు వల కప్పకుంటే జరిమానా

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే ట్రాక్టర్లు విధిగా చెత్తపై వల కప్పాలని, అలా చేయకుంటే రూ. వెయ్యి జరిమానా విధిస్తామని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. మంగళవారం జాతీయ రహదారిపై వల కప్పకుండా ప్రయాణిస్తున్న చెత్తట్రాక్టరును గుర్తించిన ఆయన దాన్ని వెంబడించి వల కప్పించారు. అనంతరం మాట్లాడుతూ వీధులు, రోడ్లపై సేకరించిన చెత్తను వల కప్పకుండా తీసుకెళ్తే, తిరిగి అదంతా రోడ్లపై పడుతుందని తెలిపారు. తద్వారా ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్నారు.



వల కప్పిన చెత్త ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

**● రెండేళ్లలో విద్యుత్ ప్లాంటు**

రానున్న రెండేళ్లలో చెత్తనుంచి విద్యుత్ వచ్చేలా ప్లాంటును నెల్లూరులో ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఎన్‌ఎంసీలోని తన చాంబరులో ఒంగోలు, కావలి, కందుకూరు, బుచ్చి, అల్లూరు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరులో సేకరించే వ్యర్థాలతో విద్యుత్ ప్లాంటును నిర్మించేందుకు కసరత్తు జరుగు తుందన్నారు. ఈ ప్లాంటు పూర్తయ్యేలోపు నెల్లూరులో ఉన్న 8 లక్షల టన్నుల వ్యర్థాలను గుంటూరులో ఉన్న ప్లాంటుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కాగా రెవెన్యూ వసూళ్లగా డీసీ చెన్నుడు ఆర్‌ఐ, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు.

## విద్యావ్యవస్థలో మార్పులు

**● టీడీపీ నేత చేజర్ల**

కోవూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని టీడీపీ నెల్లూరు పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని రాజకీయ ప్రయోగశాలగా మార్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకుందన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.143 కోట్లను కేటాయించడం అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్కాలర్‌షిప్పుల బకాయిలకు రూ.788 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. విద్యామంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సాగిస్తున్న కృషి అభినందనీయమన్నారు.

## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

నెల్లూరు(వైద్యం) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయటం పట్ల సీఎం చంద్రబాబుకు, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూ. సురేంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి రూ. 4.86 కోట్లు విడుదల చేశారన్నారు. ఇందులో ప్రభుత్వం రూ. 2.43 కోట్లు రాయితీ ఇస్తుందని తెలిపారు. బ్యాంకుల ద్వారా ఈ రుణాలు మంజూరు చేస్తారని వెల్లడించారు. అర్హులైనవారు ఆధార్‌కార్డుతో పాటు రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ, బీసీ గుర్తింపు కార్డు, బాప్టిజం గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## డిగ్రీ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో రావూస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వరరావు తెలిపారు. నగరంలోని రావూస్ విద్యాసంస్థల్లో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు బీఎస్సీ కెమిస్ట్రీలో బీ.సంధ్య 98శాతం, బీసీఏ డేటా సైన్స్‌లో కేసీ.నందిని 98శాతం, బీబీఏలో ఐ.గీతిక 96శాతం, బీసీఏ కంప్యూటర్స్‌లో ఎస్.లక్ష్మీప్రియ 95శాతం, బీకామ్ కంప్యూటర్స్‌లో ఎస్‌కే.రేష్మ 93శాతం, పీ.సుప్రజ 93శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో సీహెచ్.మౌనిక 91శాతం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వై.శివసంకేత్, సీఈవో ఎన్.శివారెడ్డి, డీన్ పీ.సుందర్, ప్రిన్సిపాల్ షరీఫ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


విశేషాలంకరణలో శ్రీకాళహస్తీశ్వరాలయం



# శివోహం

మహాశివరాత్రికి జిల్లాలోని శివాలయాన్నీ ముస్తాబయ్యాయి. ఆలయాలకు ప్రత్యేక అలంకరణలను చేపట్టారు. వేకువజాము నుంచే వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని పలు ఆలయాల్లో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేయనున్నారు. ఆలయాల్లో పగలంతా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాయంత్రం హరికథా కార్యక్రమాలు ఉంటాయి. రాత్రి జాగారం చేసే భక్తుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తమ్మీద బుధవారం శివాలయాలన్నీ భక్తజనంతో సందడిగా మారనున్నాయి.



శేష, యాళి వాహనాలపై స్వామి, అమ్మవార్లు

## శేష వాహనంపై పరమశివుడి విహారం

● యాళి వాహనంపై జగదాంబ చిద్విలాసం ● ఉదయం హంస, శుక వాహన సేవలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి పరమ శివుడు శేష వాహనంపై.. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై ఊరేగారు. అంతకుముందు ఆలయ అలంకార మండపం, యాగశాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ప్రదక్షిణగా గురుదక్షిణామూర్తి సన్నిధినుంచి రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ శేష, యాళి వాహనాలపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. స్వామిఅమ్మవార్ల ముందు మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారం సాగింది. స్వామిఅమ్మవార్ల పరివారాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. ఉదయం.. స్వామి అమ్మవార్లు హంస, శుక వాహనాలపై ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


హంస, శుక వాహనాల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

## శివయ్యకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. జ్ఞానప్రసూనాంబిక అతిథి గృహం వద్ద మంత్రికి స్వాగతం పలికి ఊరేగింపుగా ఆలయం లోపలకు తీసుకొచ్చారు. అలంకార మండపంలో ఉత్సవర్ల వద్ద పట్టువస్త్రాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈవో బాపిరెడ్డికి అందజేశారు. వాటిని స్వామి అమ్మవార్లకు ధరింపజేసి పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్ష అని మీడియాతో మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాల్లో నేడు

- ● ఉదయం 10.30 గంటలు: ఇంద్రవిమానం- చప్పర సేవ
- ● రాత్రి 9.30 గంటలు: నంది- సింహ వాహనసేవ


బంగారు ఆభరణాలతో సూర్య

## గోల్డ్ మ్యాన్

● 8 కిలోల ఆభరణాలతో శ్రీవారిని దర్శించుకున్న భక్తుడు

హైదరాబాదుకు చెందిన సూర్య.. ఎనిమిది కిలోల బంగారు ఆభరణాలు ధరించి తిరుమలకు వచ్చారు. మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన్ను చూసేందుకు పలువురు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా సూర్య మీడియాతో మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో ఎస్‌ఎస్‌ఎస్ ప్రజాసేవా ఫౌండేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి బతికున్నప్పుడు బంగారు ఆభరణాలు వేసుకోమని చెబుతుండేదన్నారు. ఆమె చనిపోయాక.. ఆమె కోరిక మేరకు తాను ఈ ఆభరణాలను ధరించినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని నరసింహుడి ఆభరణం తన వద్ద ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## రుయాకు సీఎస్‌ఆర్ అనుమతి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వితరణ అందించే దాతలకు పన్ను మినహాయింపు అనుమతులు లభించినట్లు సూపరింటెండెంట్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలకు పన్ను మినహాయింపు ఇచ్చేందుకు సీఎస్‌ఆర్-1(కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) సర్టిఫికెట్ కోసం ఎన్నాళ్లగానో శ్రమించామని పేర్కొన్నారు. చివరకు మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేషన్ ఎఫైర్స్ నుంచి సీఎస్‌ఆర్-1 అనుమతి పొందామని తెలిపారు. ఇకపై రుయాస్పత్రికి ఆర్థిక సాయం అందించే పరిశ్రమల నిర్వాహకులకు పన్ను మినహాయింపు ఉంటుందన్నారు.

## గవర్నర్ ప్రసంగం ప్రజలకు భరోసా

● అసెంబ్లీ వాయిస్: తిరుపతి ఎమ్మెల్యే

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో మంగళవారం జరిగిన చర్చలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజల్లో భరోసా కల్పించిందన్నారు. 93 కేంద్ర పథకాలను గత ప్రభుత్వం నిలిపివేయగా 74 పథకాలను ఎనిమిది నెలల్లో సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ధరించారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన పథకాల గురించి వివరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్న భరోసాను గవర్నర్ ప్రసంగం ఇచ్చిందన్నారు.





## భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవు

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరిక

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ పీఆర్వో అని చెప్పుకొంటూ ప్రసాద్ అనే పేరుతో.. చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని.. తిరుమల సమాచారం అనే గ్రూప్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ భక్తులకు శ్రీవారి దర్శన టికెట్ల ఆశజూపి ఓ వ్యక్తి నగదు వసూలు చేస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఐ భక్తుడు గోపాల్‌రాజ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని బీఆర్ నాయుడు తీవ్రంగా పరగణించి చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులను ఆదేశించారు.వింగ్ సిబ్బంది బాధితుడి నుంచి చేపట్టిన వివరాల ఆధారంగా నిందితుడు హైదరాబాదులోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావేద్ ఖాన్‌గా గుర్తించారు. విజిలెన్స్ ఫిర్యాదుతో తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో నిందితుడు వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ భక్తుల నుంచి దర్శనం పేరుతో భారీ మొత్తంలో వసూలు చేస్తూ వారి నుంచి డబ్బు అందాక.. గ్రూప్ నుంచి రిమూవ్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈక్రమంలో శ్రీవారి భక్తులను మోసం చేసే ఏ ఒక్కరిని ఉపేక్షించమని, దళారులు, మోసగాళ్లపై కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. నకిలీ వెబ్‌సైట్లను, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శనం, వసతి బుక్ చేసుకోవాలని కోరారు.


మృతి చెందిన జింకను తొలగిస్తున్న సిబ్బంది

## వాహనం ఢీకొని జింక మృతి

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. ఏడో మైలు మార్గ మధ్యలో ఏనుగుల ఆర్చ్ వద్ద వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. వాహన చోదకులు గుర్తించి ఫారెస్ట్ విభాగానికి సమాచారమిచ్చారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు చేరుకుని మృతి చెందిన జింకను తరలించారు.

## నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ జిల్లాలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా కార్యాలయాలకు సెలవైనా తమ రెవిన్యూ కార్యాలయాల్లో వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని రెవిన్యూ కార్యాలయాలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు.

## మోటారు సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● 9 బైక్‌ల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పరిసరాల్లో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.65 లక్షల విలువ చేసే 9 బైకులను స్వాధీనం చేసుకొన్నారు. ఈ వివరాలను సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని బాపూజీ కాలనీ చెందిన ఇట్టా మహేంద్ర, షేక్ ఉజామ, కుదిరి తిప్పకండ్రిగకు చెందిన వంశీ.. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఇళ్ల ముందు, రైల్వేస్టేషన్ సమీపంలో నిలిపివున్న మోటరు సైకిళ్లను చోరీ చేసేవారు. వాటిని తమిళనాడులో విక్రయించేవారు. సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న మహేంద్ర, షేక్ ఉజామ, వంశీని పోలీసులు విచారించగా బైకుల చోరీ విషయం బయటపడింది. వారిచ్చిన సమాచారంతో బాపూజీ కాలనీ సమీపంలో పాడుపడిన ఇళ్ల వద్ద దాచి ఉంచిన 9 మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వంశీ 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. చోరీ చేసిన బైక్‌లను తీసుకెళ్లేందుకు తమిళనాడులో ఓ ముఠా ఉందని, త్వరలో వారినీ పట్టుకుంటామని సీఐ చెప్పారు.

## తిరుమలలో కన్నప్ప బృందం


శివబాలాజీ, మంచు విష్ణు

తిరుమల శ్రీవారిని మంగళవారం కన్నప్ప సినిమా బృందం దర్శించుకుంది. హీరో మంచు విష్ణు, నటుడు శివ బాలాజీ, ఇతర చిత్ర బృంద సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఎంపీ జయరాం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, నటి నిహారిక, నవ్య కూడా స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నిహారిక - నవ్య


## హుండీ ఆదాయం 4..14 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,764

తలనీలాలు సమర్పించినవారు: 23,504





# ముక్కంటి మహాశివరాత్రికి సర్వం సిద్ధం

### క్యూలైన్లలోకి ప్రవేశం ఇలా..

భక్తులు వేర్వేరుగా ఆయా క్యూలైన్లలో ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం. ఆలయ 1వ గేటు నుంచి ఉచితక్యూలైన్, 2వ గేటు నుంచి రూ.200క్యూలైన్, మూడో గేటు నుంచి రూ.500 క్యూలైన్, 4వ గేటు నుంచి వీఐపీ ప్రవేశమార్గం కోసం క్యూలైన్లను పకడ్బందీగాసిద్ధం చేశారు. వీఐపీల ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యేక లాంజ్‌లను సిద్ధం చేశారు. ఇక, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్డీవో, ఈవో పర్యవేక్షణలో పరిమిత సంఖ్యలో వీఐపీలను దర్శనానికి పంపేలా ఏర్పాటు చేశారు.



### ఆలయం లోపలా పక్కాగా..

ఆలయం లోపల ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయి గందరగోళ పరిస్థితులకు తావులేకుండా చర్యలు చేపట్టారు. మహద్వారంనుంచి స్వామివారిసన్నిధి, అక్కడి నుంచి అమ్మవారి గర్భగుడి వరకు క్యూలైన్లను ప్రణాళిక బద్ధంగా ఉంచారు. అమ్మవారి దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వెనుక వైపు నుంచి మెట్ల మార్గం ద్వారాదక్షిణగోపురం వద్దకు భక్తులు వెలుపలకు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయే అవకాశం లేదు. ఇక, అడ్డదారి దర్శనాలకు తావులేకుండా దక్షిణగోపురం, మహద్వారం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును కేటాయించారు.




శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు 1.5 లక్షల మంది భక్తులకు దర్శన సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది తొలిసారిగా భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. దర్శనానంతరం దక్షిణ గాలిగోపురం నుంచి భక్తులందరూ వెలుపలకు వచ్చేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ప్రసాదాల కౌంటర్లను భక్తులకు అందుబాటులో పెట్టారు. భక్తులందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం ఇచ్చేలా పెద్దఎత్తున తయారు చేశారు. అలాగే మహిళలకు సౌభాగ్యప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉచిత ప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.గతంలో పది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా... ఈసారి ఆలయ పరిసరాలతో పాటు పట్టణ వ్యాప్తంగా 25 శిబిరాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. క్యూలైన్లలో భక్తులకు పంపిణీ చేయడానికి రెండు లక్షల వాటర్ బాటిళ్లు, 2 లక్షల బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇక రాత్రి నంది సేవలో భక్తుల రద్దీకి అనుగుణంగా మాడవీధుల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధరాత్రిపైన ఆలయంలో లింగోద్భవం సందర్భంగా సామాన్య భక్తులందరూ దర్శించుకునేలా క్యూలైన్ విధానాన్ని పాటించనున్నారు.



### ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బుధవారం వేకువజామున 4గంటల నుంచి పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలను ఆపేయనున్నారు. దీనికోసం అన్ని ప్రవేశ మార్గాల వద్ద పోలీస్ అవుట్ పోస్టులతో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల కోసం కేటాయించారు. పట్టణ అన్ని ప్రవేశ మార్గాలోని శివారు మార్గాల్లో మొత్తం 11 వాహనాల పార్కింగ్ కేంద్రాలను కేటాయించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ఉచిత రవాణా సౌకర్యాన్ని సిద్ధం చేశారు.


సిద్ధమైన ఉచిత దర్శన క్యూలైను


అద్దాల మండపం వద్ద క్యూలైన్లు పరిశీలిస్తున్న ఎస్పీ రవి మనోహరాచారి


రూ500 క్యూలైన్లు


ఆలయంలో అకట్టుకుంటున్న పూల అలంకరణలు


రూ.200 క్యూలైన్

## కల్యాణ వెంకన్న రథోత్సవం

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పాలంకృత రథంపై శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవమూర్తులను రథంలో అధిష్ఠింపజేశారు. గోవింద నామస్మరణల మధ్య అర్చకులు, అధికారులు,భక్తులు మాడవీధుల్లో రథాన్ని భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. రాత్రి పట్టు, పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో కల్కి అవతారంగా స్వామిని అలంకరించారు. ఉత్సవవర్లు అశ్వ వాహనంపై అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని సినీనటుడు డాక్టర్ మోహన్‌బాబు దర్శించుకున్నారు. అశ్వవాహన సేవలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవోల వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, కంకణ భట్టర్ నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.




అశ్వవాహన సేవలో మోహన్‌బాబు

## చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వేసవిలో ఏనుగుల మంద నీటి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం సాధారణం. మే, జూన్ నెలల్లో ఇటువంటి సంఘటనలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఫిబ్రవరిలోనే ఏనుగుల మంద వచ్చి మామిడి తోపులు, వరి పంటలను ధ్వంసం చేయడం ఇదే మొదటి సారంటున్నారు. ఏనుగుల రాకను గమనించిన గ్రామస్తులు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

## వైసీపీకి భారీ షాక్

● పవన్ సమక్షంలో పెద్దఎత్తున జనసేనలో చేరికలు

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన పది మంది కార్పొరేటర్లు, ఇద్దరు టౌన్‌బ్యాంకు డైరెక్టర్లు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లతో పాటు మరో 11 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో వీరంతా జనసేన కండువా కప్పుకొన్నారు. తొలుత వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు మాత్రమే జనసేనలోకి చేరుతారని ప్రచారం జరిగింది. అయితే పెద్దఎత్తున వైసీపీ నేతలు చేరడంతో రాజకీయంగా చర్చగా మారింది. డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో మనస్తాపంతో బయటకు వచ్చిన భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అనుచరుడు 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే. బాబు పవన్ సమక్షంలో జనసేనలో చేరి షాక్ ఇచ్చారు. అలాగే, వైసీపీ కార్పొరేటర్లు పొన్నాల చంద్ర (28వ డివిజన్), టిశైలజ (32వ), దూది కుమారి (33వ), కుడితి సుబ్రమణ్యం (36వ), రాధ యాదవ్ (43వ), ఆదం లీలావతితో పాటు ఇదివరకు చేరిన సీకే రేవతి (31వ), కల్పన యాదవ్ (30వ), వట్టికుంట నారాయణ (44వ డివిజన్) కూడా పవన్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. తిరుపతి టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొటారి సుభాష్‌తో పాటు అధికార ప్రతినిధి తిరుత్తణి వేణుగోపాల్, నాయకులు దూది శివ, ఎస్కేఫిరోజ్, పి.సుధీర్, నయనార్ శ్రీనివాసులు, సునీల్ చక్రవర్తి, యశ్వంత్, కార్తీక్, నరేష్ రెడ్డి, సీకే రవి, యాదవ కృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు ఆరణి మదన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.




జేఎస్పీలో చేరిన వైసీపీ యువత అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ - వైసీపీ సీనియర్ నేత, కార్పొరేటర్ ఎస్కే బాబు - టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్

## ఏనుగుల దాడిలో గాయపడిన బాలికకు రుయాలో చికిత్స

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిలా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని శేషాచల అడవిలో ఏనుగుల గుంపు దాడి చేసిన ఘటనలో గాయపడిన బాలికకు తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స అందించారు. రైల్వే కోడూరు మండలం ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన 30 మంది తలకోనకు వచ్చేందుకు కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల సమయంలో శేషాచలం అటవీమార్గంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో మహాలక్ష్మి(16)ని రుయాస్పత్రి తీసుకురాగా, వైద్యులు పరీక్షించారు. ఆమె కాలిభాగం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



## తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఘటనలపై దర్యాప్తు చేయించండి

● హైకోర్టులో మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పిల్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన ఘటనలపై సీబీఐ లేదా హైకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మంగళవారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈనెల 3, 4 తేదీల్లో పోలీసులు, ఎన్నికల అధికారుల పాత్రపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ఏపీ ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.

## వివాదాస్పద భూమిలో సగం అటవీశాఖదే



సర్వే చేస్తున్న రెవెన్యూ, అటవీశాఖాధికారులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి మండలం అలిమిలి పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 4లో వివాదాస్పదంగా మారిన స్థలంలో సగం అటవీశాఖ భూమేనని తేలింది. ఆదివారం అర్ధరాత్రి వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొందరు వివాదాస్పద భూమిలో గుడిసెలు వేసేందుకు యత్నించగా అలిమిలి గ్రామస్తులు అడ్డుకున్నారు. రెండు గ్రామాల మధ్య వివాదం తలెత్తడంతో కొందరు 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపిచేశారు. సోమవారం ఉదయం ఎస్ఐ గోపి తన సిబ్బందితో వెళ్లి వివాదాస్పద భూమిని పరిశీలించి అలిమిలి గ్రామస్తులతో చర్చించారు. మంగళవారం అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించారు. ఆక్రమణకు గురైన సగం భూమి అటవీ శాఖకు చెందినదేనని తేల్చారు. అటవీశాఖకు చెందిన భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖాధికారులు హెచ్చరించారు. కాగా, రెవెన్యూశాఖకు చెందిన భూమిని రెండు గ్రామాల నిరుపేదల పంచాలని ప్రజలు కోరుతున్నారు.

## అధునాతన బోధనపై అవగాహన కల్పించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అధునాతన బోధనపై విస్తృత ప్రచారం చేయాలని ఎంఈవో మస్తానయ్య, సీడీపీవో మునిరవి కుమారి కోరారు. కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈవో, సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల మెదడుకు పదును పెట్టే విధంగా బోధన జరగాలన్నారు. అందుకోసం ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేయాలన్నారు. ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాగరమాల పరిహారం లబ్ధిదారుల ఎంపిక



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయజయరావు

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లె సచివాలయంలో మంగళవారం సాగరమాల రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారమిచ్చేందుకు గ్రామసభ నిర్వహించారు. నెల్లూరుపల్లె, కొత్తపాళెం, అగ్రహారం గ్రామాల్లోని 15మంది రైతులకు చెందిన భూములు రోడ్డు విస్తరణలో పోయాయి. అయితే అడంగల్‌లో రైతుల పేర్లు లేకపోవడంతో పరిహారం నిలిపివేశారు. మంగళవారం తహసీల్దార్ జయజయరావు గ్రామసభ నిర్వహించి 15మంది రైతులను పరిహారం కోసం అర్హులుగా ఎంపిక చేసి నివేదికను గూడూరు సబ్‌కలెక్టర్‌కు పంపించారు.

## ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, చంద్రశేఖర్, సీడీపీవో ఉమామహేశ్వరి

ఓజిలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18నుంచి 25వ తేదీ వరకు రెండు విడతలుగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం తదితర అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. డీఆర్‌పీలుగా సుజనమ్మ, మహబూబీ, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, చంద్రశేఖర్, సీడీపీవో ఉమామహేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఐదుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కేశవరం, చిట్టేడు, గూడలి, కోట 1, కోట 3, పంచాయతీల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో గోపి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో చేయడంలో నిర్లక్ష్యం వహించారని, జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావడం లేదన్న కారణాలతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

# వరికి గిట్టుబాటు ధర కల్పించండి




తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘ నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వివి. రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం క్వింటాలు ధరలు రూ.1650కి పడిపోయిందని, ఆరుగాలం పండించిన రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మద్దతు ధర రూ.2500 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి సునీత మాట్లాడుతూ ధాన్యం ఎగుమతులకు అనుమతించాలని, లేదంటే మద్దతు ధర్పై బస్తాకి రూ.500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతాన్ని 22గా నిర్ణయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, తిరుపాలు, భాస్కర్, పారి పెంచలయ్య, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, ఓబయ్య, రైతులు పాల్గొన్నారు.

# కోలాహలంగా ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు





పందెంలో పరుగులు తీస్తున్న ఎద్దులు - మొదటి బహుమతి అందుకుంటున్న భాస్కరరెడ్డి

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం సూరిశెట్టిపాళెంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు జరిగాయి. ఆలయ ధర్మకర్త రామయ్యశెట్టి ఆధ్వర్యంలో ఈ పోటీల్లో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాలకు రైతులకు చెందిన ఒంగోలు జాతి ఎద్దులు పాల్గొన్నాయి. కోట మండలం వంజివాకకు చెందిన మల్లు భాస్కర్‌రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. అదేవిధంగా సూరిశెట్టిపాళెం గ్రామానికి చెందిన భాస్కర్‌కు చెందిన ఎద్దులు రెండవ బహుమతిగా రూ.20 వేలు, వాకాడు మండలం కల్లూరు కొత్తపాళెం గ్రామస్తుడు కోటయ్యకు చెందిన ఎద్దులు మూడవ బహుమతి రూ.10 వేలును, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రమ ణయ్య ఎద్దులు నాల్గవ బహుమతి రూ.5వేలు, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు ఎద్దులు ఐదో బహు మతి రూ.మూడువేలు గెలుచుకున్నాయి.

## పెద్ద జిలకర్ల ధరలు పతనం

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద జిలకర్లు(బీపీటీ 5204) ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయి. గత ఏడాది పెద్ద జిలకర్లు ధాన్యం పుట్టి రూ.24,500 పలికింది. దీంతో రైతులు ఈ రకం సాగుపై మక్కువ చూపారు. కోట, వాకాడు, చిట్టమూడు మండలాల్లో ఎక్కువ మంది రైతులు బీపీటీ 5204 రకం పంటను సాగు చేపట్టారు. వరి కోతల అనంతరం మొదట్లో పుట్టిధాన్యం రూ.18,500 పలకగా, ప్రస్తుతం రూ.18,000 వరకు పడిపోయింది. రూ.17,000లకు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతుండడంతో రైతులు వచ్చిన కాడికి అమ్ముకునేందుకు విక్రయాలు జరుపుతున్నారు.

## పాఠశాల విలీనంపై నిరసన

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కొత్తపాళెం పాఠశాలలో విలీనం చేయడంపై అక్కడి విద్యార్థుల తల్లితండ్రులు, విద్యా కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. తరగతుల విలీనాన్ని ఆపకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో మస్తానయ్యకు వినతిపత్రం అందజేశారు.

## ఆప్కాస్ రద్దు ఆలోచన మానుకోవాలి



మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపీనాథ్, శివకుమార్, కోటేశ్వరరావు, బీవీ రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిత



ఎంఈవో మునిరత్నంను సన్మానిస్తున్న శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధతో ఉన్నత విద్య అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో మునిరత్నం అన్నారు. మంగళవారం స్థానిక విద్య పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సెల్ ఫోన్, ఇంటర్నెట్‌కు ఆకర్షితులై సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి ఎంఈవో ముని రత్నం, శ్రీవేమా విద్యా సంస్థల అధినేత, శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరు పేట సత్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గిరిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాగేశ్వరస్వామి ఆలయంలో హోమం



హోమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీహరిరెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరిస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. ముందుగా కలశస్థాపన చేసి శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం ఎదుటనున్న నంది వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ్ల శ్రీహరి రెడ్డి, నలజాం రాము, చెన్నం శ్రీనివాసులు, శాంతి, రాజశేఖర్, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ పాల్గొన్నారు.

## జీవో 30ని సద్వినియోగం చేసుకోండి

తడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన జీవో 30ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శరత్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారికి ఈ జీవో ద్వారా హక్కులు సక్రమించే అవకాశం ఉందన్నారు. అయితే కాలువ, డొంక పోరంబోకు, రోడ్లు, ప్రైవేట్ లేఅవుట్లలోని ప్రభుత్వ స్థలాలకు ఇది వర్తించదన్నారు. మూడొందల చదరపు అడుగుల వరకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, అంతకు మించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు.

## అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

పెళ్లకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన జీవో 30 మేరకు అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకోవచ్చని తహసీల్దారు ద్వారకనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు మాత్రమే ఈ జీవో ద్వారా క్రమబద్ధీకరణ దరఖాస్తుకు చేసుకోవచ్చన్నారు. చెరువులు, కాలువలు స్థలాలకు క్రమబద్ధీకరణకు వర్తించదన్నారు.

## ఆశ్రమానికి నిత్యావసర సరకుల అందజేత



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న సురేంద్రబాబు

నాయుడుపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని చేయూత అనాథాశ్రమానికి మంగళవారం శాఖమూరి సురేంద్రబాబు బియ్యం, పప్పు దినుసులు, నూనె తదితర నిత్యావసర సరకులను అందజేశారు. సురేంద్రబాబు భార్య పారిజాత వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. ఇకనుంచి ప్రతినెలా ఒక రోజు చిన్నారులకు భోజన సదుపాయంతో పాటు నిత్యావసర సరకులు అందజేస్తామని చెప్పారు. ఆశ్రమ నిర్వాహకుడు కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో భావన, కొమ్మి అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వృత్తి విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించుకునేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమాదేవి, రూపా, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో నేటి కార్యక్రమాలు



మూలస్థానేశ్వరస్వామి ఆలయం

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం ఆలయాల్లో స్వామివారికి పూజలు నిర్వహించేందుకు, భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

**గూడూరు:** పట్టణంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి (పెద్ద శివాలయం)లో బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, లింగోద్భవకాల రుద్రాభిషేకం, స్వామి, అమ్మవార్ల మాడ ఉత్సవం నిర్వహించనున్నారు.

**కోట:** గూడలి గ్రామంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. గూడలితిప్పపై వెలసిన పర్వతవర్ధినీ సమేత భీమేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణో త్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



గూడలిలోని భీమేశ్వరాలయం

**చిల్లకూరు:** చేడిమాల గ్రామంలోని కామాక్షీదేవి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రికి స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తారు.



చేడిమాలలోని నాగలింగేశ్వరాలయం

**దక్కిలి:** దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, రాత్రికి పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.



స్తభాలగిరి ఈశ్వరయ్యస్వామి దేవాలయం

**వెంకటగిరి:** పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలు జరపనున్నారు.

**వాకాడు:** మండలం పంట్రంగం గ్రామంలోని కామాక్షీ సమేత పాండురంగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి స్వామివారికి పాలతో అభిషేకం జరపనున్నారు. రాత్రికి స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహిస్తారు.



పంట్రంగంలోని పాండురంగేశ్వరాలయం

**నాయుడుపేట:** పాత బ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, స్వామివారికి క్షీరాభిషేకాలు, నివేదన జరుగుతాయి. రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం నిర్వహిస్తారు. తుమ్మూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహా గణపతికి అభిషేకం, స్వామివారికి నంది, హంస వాహన సేవలు, రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం నిర్వహించ నున్నారు. స్వర్ణముఖి నది తీరంలోని ప్రసూనాంబ నీలకంఠేశ్వర ఆలయంలో రుద్రహోమం, లలిత హోమం, మహాపూర్ణాహుతి, నందివాహన సేవ రాత్రి రుద్రాభిషేకం చేస్తారు.



నాయుడుపేట కాశీవిశ్వేశ్వర ఆలయం

**సూళ్లూరుపేట:** పట్టణంలోని గంగా పార్వతీ సమేత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, రాత్రి రుద్రాభిషేకం చేస్తారు. మన్నారు పోలూరు సంతానేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి కాళంగి నదిలో నీటిని తెచ్చి అభిషేకం చేస్తారు. అదేవిధంగా కుదిరిలో మల్లికార్జునేశ్వర స్వామి ఆలయం, కొరిడి వనలీలా కంఠేశ్వర ఆలయంలో అభిషేకాలు చేస్తారు.



మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి ఆలయం

**తడ:** చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వరస్వామి అన్నపూర్ణాదేవి ఆలయం, బోడిలింగాలపాడులో ఉన్న భువనేశ్వరి స్వామి ఆలయం, వాటంబేడు వద్దనున్న విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నారు.



మాంబట్టు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

**ఓజిలి:** భట్లకనుపూరులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ, హోమం నిర్వహిస్తారు.

**చిట్టమూరు:** యాకసిరి తిప్పపై వెలసిన భూపతేశ్వరస్వామి ఆలయం, యాకసిరి పాటిమిట్ట నాగే శ్వరస్వామి, గునపాడు వల్మీకి నాగేశ్వరస్వామి, మల్లాంలోని మార్కేండేయ స్వామి ఆలయాల్లో ఉదయం శివలింగాలకు అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం భూపతేశ్వరస్వామి గ్రామోత్సవం, కల్యాణోత్సవం, రాత్రి 11 గంటలకు పుష్పాభిషేకం నిర్వహిస్తారు.



యాకసిరితిప్ప భూపతేశ్వరస్వామి ఆలయం

## నీలకంఠేశ్వరాలయంలో శివరాత్రి మహోత్సవాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి హోమం, పూర్ణాహుతి, ప్రదోషకాల పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గూడూరు ప్రభావతి, సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు